PRABHATA SURYA
ప్రభాత సూర్య
తెలుగు దిన పత్రిక
www.suryaa.news
వెల రూ.5/ - పేజీలు : 8 శనివారం 13 సెప్టెంబర్ 2025 సంపుటి: 01, సంచిక : 79
PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

## మరింత అగాధంలోకి రూపాయి

అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ మరింత అగాధంలోకి జారింది. చరిత్ర లోనే ఎప్పుడూ లేని స్థాయిలో 88.47కు పతనమయ్యింది. అమెరికా, భారత్ మధ్య చోటు చేసుకుంటున్న టారిఫ్ ఆందోళ నలు రూపాయి విలువను చరిత్రలో ఇది వరకు ఎప్పుడు లేని కనిష్ట స్థాయికి పడేలా చేస్తున్నాయి. గురువారం డాలర్‌తో రూపాయి మారకం విలువ మరో 36 పైసలు పతనమై 88.47కి దిగజారి.. ఆల్‌టైం కనిష్ట స్థాయిని చవి చూసింది. ఫారెక్స్ మార్కెట్‌లో ఉదయం 88.11 వద్ద ప్రారంభమైన రూపాయి విలువ ఓ దశలో 88.47 అత్యల్ప స్థాయికి పడిపోయింది. ఇంతక్రితం సెప్టెంబర్ 5న 88.38 కనిష్ట స్థాయిని తాకింది. ఆ తర్వాత భారీ స్థాయిలో పడిపోవడం ఇదే తొలిసారి. రూపాయి విలువ పతనం అంతర్జాతీయ మార్కెట్‌లో దిగుమతులను భారం చేయనున్నాయి.




# ఏం చెబుదాం!?



- న్యాయ నిపుణులతో చర్చల్లో దానం, కడియం
- బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ తరపున పోటీ చేసిన నాగేందర్
- వరంగల్ లోక్‌సభలో కాంగ్రెస్ అభ్యర్థి తరపున శ్రీహరి ప్రచారం
- వివరణ ఇవ్వడంపై మల్లగుల్లాలు.. మరింత గడువు కోరిన ఎమ్మెల్యేలు

సూర్య హైదరాబాద్

నోటీసులు అందుకున్న పది మంది ఎమ్మెల్యేల్లో ఎనిమిది మంది స్పీకర్‌కు వివరణ ఇచ్చారు! పిలిచినప్పుడు హాజరై దానిపై వాదనలు వినిపించాలంటూ బీఆర్ఎస్‌కు స్పీకర్ కార్యాలయం నోటీసులూ ఇచ్చింది! కానీ, దానం నాగేందర్, కడియం శ్రీహరి ఇంకా న్యాయ నిపుణులతో చర్చల్లోనే ఉన్నారు. వివరణ ఇచ్చేందుకు స్పీకర్ నుంచి మరింత గడువు కూడా కోరారు. ఇందుకు కారణం లేకపోలేదు. మిగిలిన ఎనిమిది మందిదీ ఓ దారి అయితే.. వీరిద్దరిదీ 'రహదారి' కావడమే ఇక్కడ సమస్య. అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ టికెట్‌పై గెలిచిన పదిమంది కాంగ్రెస్‌లో చేరారని, వారిపై అనర్హత వేటు వేయాలని స్పీకర్ ప్రసాద్ కుమార్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. వారిని అనర్హులను - మిగతా2లో




## దక్షిణాది కుంభమేళాలా

# గోదావరి పుష్కరాలు

- బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాల అభివృద్ధి
- ఒకే రోజు 2 లక్షల మంది వచ్చినా ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు
- శాశ్వత ప్రాతిపదికన పనులు
- సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు
- దక్షిణ భారత కుంభమేళా తరహాలో ఘనంగా నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లు
- శాశ్వత మౌలిక వసతులు, అభివృద్ధి పనులపై ఇప్పటి నుంచే దృష్టి

హైదరాబాద్

గోదావరి పుష్కరాలకు శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారుల్ని ఆదేశించారు. బాసర నుంచి భద్రాచలం వరకు నదీ తీరం వెంట ఉన్న ధర్మపురి, కాళేశ్వరంతోపాటు అన్ని ప్రధాన దేవాలయాలను అభివృద్ధి చేయాలని స్పష్టం చేశారు. దక్షిణ భారత కుంభమేళా తరహాలో ఘనంగా నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని దిశానిర్దేశం చేశారు. గోదావరి పుష్కరాల ఏర్పాట్లు, ముందస్తు సన్నద్ధతపై కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. 2027 జులై 23 నుంచి మొదలయ్యే గోదావరి పుష్కరాలకు దాదాపు 22 నెలల వ్యవధి ఉన్నందున శాశ్వత మౌలిక వసతులు, అభివృద్ధి పనులపై ఇప్పటి నుంచే దృష్టి సారించాలని సూచించారు. ఒకే రోజు రెండు లక్షల మంది భక్తులు పుష్కర ఘాట్లకు తరలివచ్చినా ఇబ్బంది లేకుండా రహదారుల నిర్మాణం, వాహనాల పార్కింగ్, తాగు నీరు, స్నానాల ఘాట్లు, అవసరమైన అన్ని వసతులు ఉండేలా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలన్నారు. దాదాపు 74 చోట్ల పుష్కర ఘాట్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంటుందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. "ప్రస్తుతం ఉన్న పుష్కర - మిగతా2లో



# ఉపరాష్ట్రపతిగా రాధాకృష్ణన్ ప్రమాణం

హాజరైన ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు, తెలుగు రాష్ట్రాల గవర్నర్లు
ఉప రాష్ట్రపతిగా సి.పి.రాధాకృష్ణన్‌తో ప్రమాణం చేయిస్తున్న రాష్ట్రపతి

- ఇటీవలి ఎన్నికల్లో జస్టిస్ సుదర్శన్ రెడ్డిపై గెలుపు
- మహారాష్ట్ర గవర్నర్ పదవికి నిన్ననే రాజీనామా
- ఆర్ఎస్ఎస్ నేపథ్యం నుంచి కీలక పదవికి ఎంపిక

సూర్య హైదరాబాద్

భారత దేశపు 15వ ఉప రాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్ ప్రమాణం చేశారు. శుక్రవారం ఉదయం రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో - మిగతా3లో



## పైసలకు కటకట..

# పాలన వెలవెల

- కొత్త మున్సిపాలిటీల్లో సవాలక్ష సమస్యలు
- ఆదాయానికి, ఖర్చుకు పొంతన కుదరక ఇబ్బందులు
- పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వలేని దుస్థితి
- మున్సిపాలిటీలుగా అప్ గ్రేడ్ అయినా పాత వేతనాలే
- కమిషనర్ల వేతనాలు కూడా జనరల్ ఫండ్ నుంచే
- ఇంజనీరింగ్, ఇతర పాలనా సిబ్బంది కోసం వెయిటింగ్

" ప్రత్యేక గ్రాంట్లు ఇస్తే తప్ప మున్సిపాలిటీల మనుగడ కష్టమే అంటున్న స్థానికులు

సూర్య హైదరాబాద్

రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన మున్సిపాలిటీల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఆదాయానికి, ఖర్చుకు పొంతన కుదరక సిబ్బందికి నెలల తరబడి వేతనాలు కూడా చెల్లించలేని దుస్థితి నెలకొంది. అవసరమైన సిబ్బందిని ప్రభుత్వం కేటాయించకపోవడంతో పాలన కుంటుపడుతోంది. వివిధ శాఖల నుంచి రావాల్సిన సెస్సులు, గ్రాంట్లు రాకపోవడంతో ఆర్థికంగా సతమతం అవుతున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు దఫాలుగా 20 కొత్త మున్సిపాలిటీలను ఏర్పాటు చేసింది. ప్రత్యేక గ్రాంట్లు ఇస్తే తప్ప ఈ మున్సిపాలిటీలు మనుగడ సాగించే పరిస్థితి లేదని స్థానికులు అంటున్నారు. కొత్త మున్సిపాలిటీల్లో సిబ్బంది, మౌలిక వసతుల కొరత తీవ్రంగా ఉంది. మున్సిపాలిటీ పరిధిలోని గ్రామ పంచాయతీలకు సంబంధించిన స్థిర, చరాస్తులు.. - మిగతా2లో



# లోక్‌సభలోనే వారసులెక్కువ!

- 543 మంది ఎంపీల్లో 31% మంది రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబాలవారే!
- దేశంలోని అసెంబ్లీల్లో 20%, శాసన మండలిల్లో 22%
- ఏపీలో 8, తెలంగాణలో 11 మంది ఎంపీలు వారసులే
- పురుషుల కన్నా మహిళల్లోనే అధికం: ఏడీఆర్ నివేదిక
- జాతీయ పార్టీల్లో కాంగ్రెస్‌లో వారసులెక్కువని వెల్లడి



# సుప్రీం ఆవరణలో ఫొటోలపై నిషేధం

- బెయిల్ పిటిషన్లపై 2 నెలల్లోనే నిర్ణయం
- బాణసంచాపై నిషేధం ఢిల్లీకే పరిమితం ఎందుకు?
- జాతీయ విధానం ఉండాలి కదా?
- కేంద్రానికి సుప్రీంకోర్టు ప్రశ్నలు



# 5 రాష్ట్రాల్లో మోదీ పర్యటన

నేటి నుంచి మూడు రోజులు బిజీబిజీ

అల్లర్ల తర్వాత తొలిసారిగా మణిపూర్‌కు

# బొగ్గు బ్లాక్‌లు దక్కకపోవడంతో ఇబ్బందులు

- సింగరేణిలో బొగ్గు నిల్వలు తగ్గుతున్నాయి
- సింగరేణి బోర్డు కీలక నిర్ణయం.. ఖనిజాల తవ్వకాలపై ఫోకస్..
- బొగ్గు గనులకే పరిమితం కాకుండా ఖనిజాల తవ్వకాల్లోనూ పాల్గొనాలని సింగరేణి బోర్డు నిర్ణయం
- సింగరేణి బోర్డు బొగ్గు తవ్వకాలు పెంచడంతోపాటు ఇతర మినరల్స్ మైనింగ్ చేయాలని నిర్ణయం



సూర్య హైదరాబాద్

సింగరేణి సంస్థ కేవలం బొగ్గు గనులకే పరిమితం కాకుండా ఇతర ఖనిజాల వైపు కూడా మళ్లుతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. సింగరేణి సీఎండీ బలరాంతో కలిసి సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "ప్రపంచంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా సింగరేణి మారుతోంది. ఈ సంస్థ కేవలం ఉపాధికే పరిమితం కాకుండా స్థానికులకు ఒక నమ్మకం కలిగిస్తోంది. సింగరేణి సంస్థకు అదనంగా రావాల్సిన బొగ్గు - మిగతా2లో

# పైసలకు కటకట.. పాలన వెలవెల

-మొదటిపేజీ తరువాయి

భవనాలు, లే ఔట్ అనుమతులు, పన్నుల వసూలుకు సంబంధించిన ఫైళ్లను కమిషనర్లు స్వాధీనం చేసుకుంటున్నారు. కొత్త మున్సిపాలిటీల్లో కమిషనర్, మేనేజర్ వంటి ఒకటిరెండు మిన హా మిగతా పోస్టుల్లో సమీప మున్సిపాలిటీలకు చెందిన అధికారులకు పూర్తి అదనపు బాధ్యతలు అప్ప గించారు. దీంతో వారు కొత్త మున్సిపాలిటీలకు అరుదుగా వచ్చి వెళ్తున్నారు. మేనేజర్, అసిస్టెంట్ ఇంజనీర్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్, అకౌంట్స్ ఆఫీసర్ వంటి పోస్టులు భర్తీ కాకపోవడంతో పాలనపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఈ పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ అనుమతి ఇవ్వకపోవడంతో ఇన్‌చార్జిలతోనే నెట్టుకురావాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. మరోవైపు గ్రామ పంచాయతీ కార్యాలయాలకు మున్సిపల్ కార్యాలయాలుగా బోర్డులు మార్చినా ఫర్నిచర్ కొరత వేధిస్తోంది. రికార్డులను భద్రపరచడం సమస్యగా మారింది. మున్సిపల్ కార్యాలయాలకు వచ్చే వారు కనీసం కూర్చునే పరిస్థితి లేదు.

**ఆదాయానికి, ఖర్చుకు కుదరని లంకె..**

కొత్త మున్సిపాలిటీలకు వచ్చే ఆదాయానికి, ఖర్చుకు పొంతన కుదరక ఆర్థికంగా తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ఈ మున్సిపాలిటీల్లో రెండేళ్లవరకు పన్నులను సమీక్షించి పెంచే అవకాశం లేదు. దీంతో గ్రామ పంచాయతీలకు వస్తున్న ఆదాయంతోనే పాలన సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. హైదరాబాద్ శివార్లలోని ఇస్నాపూర్, ఇంద్రేశం వంటివాటికి మినహా మిగతా చోట్ల ఆర్థిక పరిపుష్ట లేక సమస్యలు ఎదురవుతున్నాయి. గ్రామ పంచాయతీలకు సాధారణంగా ఇంటి పన్ను, ఆస్తి పన్ను, నీటి పన్ను, వాణిజ్య లైసెన్సుల జారీ, వాటి రెన్యూవల్, తైబజార్ వేలం, పశువుల సంత తదితరాల ద్వారా జనరల్ ఫండ్ సమకూరుతోంది. పాలక మండళ్లు లేకపోవడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రాంట్ల విడుదల నిలిచిపోయింది. రిజిస్ట్రేషన్, ఇతర విభాగాల నుంచి సెస్సుల విడుదల ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదు. దీంతో పారిశుద్ధ్య నిర్వహణ, ట్రాక్టర్ డీజిల్ వంటి కనీస అవసరాలు కూడా తీర్చుకోలేని స్థితిలో కొత్త మున్సిపాలిటీలు ఉన్నాయి.

**కమిషనర్ వేతనం కూడా జీఎఫ్ నుంచే..**

కమిషనర్, అధికారులు, ఇతర ఉద్యోగుల నియామకాలకు రాష్ట్ర ప్రభుత్వం పాలనాపరమైన అనుమతులు మంజూరు చేయకపోవడంతో వేతనాల చెల్లింపులో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రాష్ట్ర ఖజానా నుంచి 010 పద్దు కింద వేతనాలు చెల్లించే వెసులుబాటు లేకపోవడంతో జనరల్ ఫండ్ (జీఎఫ్) నుంచే కమిషనర్, సిబ్బంది వేతనాలు చెల్లించాల్సి వస్తోంది. విలీన గ్రామపంచాయతీల కార్యదర్శులు పట్టణంలో పనిచేస్తూ పంచాయతీరాజ్ విభాగం నుంచి వేతనాలు తీసుకుంటున్నారు. తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, పారిశుద్ధ్యం తదితర విభాగాల్లో పనిచేసే కార్మికులు, కంప్యూటర్ ఆపరేటర్లు గ్రామ పంచాయతీల్లో రూ.9,500 వేతనం పొందే వారు. మున్సిపాలిటీలుగా అప్‌గ్రేడ్ అయిన నేపథ్యంలో వారికి ప్రతి నెలా రూ.15,600 వేతనం చెల్లించాల్సి ఉంది. కానీ, చాలాచోట్ల పాత వేతనాలే ఇస్తున్నారు. వాటిని కూడా నెలల తరబడి పెండింగులో పెడుతున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

**కొత్త మున్సిపాలిటీలు ఇవే..**

కోహిర్, గడ్డపోతారం, గుమ్మడిదల, ఇస్నాపూర్, ఇంద్రేశం, జిన్నారం (సంగారెడ్డి).. కేసముద్రం (మహబూబాబాద్).. స్టేషన్ ఘన్‌పూర్ (జనగాం).. మద్దూర్ (నారాయణపేట).. ఎదులాపురం, కల్లూరు (ఖమ్మం).. అశ్వారావుపేట (భద్రాద్రి కొత్తగూడెం).. చేవెళ్ల, మొయినాబాద్ (రంగారెడ్డి).. ములుగు (ములుగు).. అలియాబాద్, మూడు చింతలపల్లి, ఎల్లంపేట్ (మేడ్చల్%–%మల్కాజ్‌గిరి).. బిచ్కుంద (కామారెడ్డి).

**జిల్లా కేంద్రమే అయినా..**

ములుగు జిల్లా కేంద్రం ఈ ఏడాది 29న గ్రామ పంచాయతీ నుంచి అప్‌గ్రేడ్ అయ్యి 20 వార్డులతో కొత్త మున్సిపాలిటీగా ఏర్పడింది. పొరుగునే ఉన్న బండారుపల్లి, జీవింతరావుపల్లి పంచాయతీలు ఇందులో విలీనం అయ్యాయి. ఇప్పటివరకు కమిషనర్, మేనేజర్ మాత్రమే బదిలీపై వచ్చారు. పురపాలనలో అత్యంత కీలకమైన ఏఈ, టీపీఎస్, అకౌంట్స్ ఆఫీసర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, హెల్త్ అసిస్టెంట్ పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. మున్సిపాలిటీలో ప్రస్తుతం 130 మంది మల్టీ పర్పస్ వర్కర్లు ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్నారు. వీరిలో 80 మంది పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్నవారే. మున్సిపాలిటీ వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలుగా కాగా, ఏటా రూ.3.27 కోట్లు వేతనాలుగా చెల్లించాల్సి వస్తోంది. దీంతోపాటు మరో రూ.1.20 కోట్లు కార్యాలయ నిర్వహణ, వాహనాలు, ఇంధనం కోసం ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉంది.

# ప్రైవేటు కాలేజీలు బంద్

హైదరాబాద్

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సాధించుకునే దిశగా ఆందోళన చేపట్టాలని రాష్ట్రంలోని ప్రైవేటు కాలేజీలు నిర్ణయించాయి. ఇందులో భాగంగా ఈ నెల 15 నుంచి కాలేజీల నిరవధిక బంద్‌కు పిలుపునిచ్చాయి. ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్‌ఆఫ్ తెలంగాణ హయ్యర్ ఇన్‌స్టిట్యూషన్స్(ఫతి) ప్రతినిధులు శుక్రవారం ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డిని కలిసి సమ్మె చేస్తున్నట్టు లిఖితపూర్వకంగా తెలిపాయి. ఈ నెల 30లోగా ప్రభుత్వం బకాయిలను విడుదల చేయకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించాయి. బంద్‌లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 1,500కుపైగా ఉన్న ప్రైవేట్ ఇంజనీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ, బీఈడీ, ఫార్మసీ, నర్సింగ్ కాలేజీలు మూతపడతాయని.. దీనివల్ల సుమారు 10 లక్షల మంది విద్యార్థులు నష్టపోతారని సంఘం నేతలు పేర్కొన్నారు.



**రూ. 10 వేల కోట్లకు చేరిన బకాయిలు..**

సుమారు రూ. 10 వేల కోట్ల మేర ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించడంలో సర్కారు విఫలమైందంటూ కాలేజీల యాజమాన్యాలు పేర్కొంటున్నాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిల సాధన కోసం 'ఫతి'పేరిట ఏర్పడి పలుమార్లు ప్రభుత్వాన్ని కలిసి విజ్ఞప్తులు చేశాయి. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీఎస్ రామకృష్ణారావు సహా ప్రభుత్వ పెద్దలందరితోనూ సమావేశమయ్యాయి. అయినా సర్కారు ఒక్క రూపాయి కూడా బకాయిలు విడుదల చేయలేదు. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ ప్రణాళికను యాజమాన్యాలు సర్కారు ముందుంచాయి. రూ. లక్ష కోట్ల డిపాజిట్లతో ప్రత్యేకంగా ట్రస్ట్ బ్యాంక్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించాయి. రూ. లక్ష కోట్ల డిపాజిట్ల సొమ్ముతో ప్రభుత్వ వాటా పరిమితమేనని.. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్), కార్పస్ ఫండ్ వంటి ఇతర మార్గాల ద్వారా ఈ నిధులను సేకరించవచ్చని సూచించాయి. ఈ డిపాజిట్లపై వచ్చే 7 శాతం వడ్డీ (సుమారు రూ. 3 వేల కోట్లు)తో ఫీజు రీయింబర్స్‌చేయవచ్చని ప్రతిపాదించాయి. అయితే అందుకు కూడా ప్రభుత్వం మొగ్గుచూపకపోవడంతో విసిగిపోయిన కాలేజీల యాజమాన్యాలు.. రాష్ట్రంలోని అన్ని రకాల వృత్తివిద్యా కాలేజీల యాజమాన్యాలు గురువారం రాత్రి సమావేశమయ్యాయి. అర్ధరాత్రి వరకు జరిగిన ఈ సమావేశం అనంతరం ఈనెల 15 నుంచి కాలేజీల నిరవధిక బంద్‌కు 'ఫతి'పిలుపునిచ్చింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయనందుకు ఇంజనీర్స్‌డేను బ్లాక్ డేగా పాటించాలని నిర్ణయించాయి.

**16 నుంచి డిగ్రీ, పీజీ కాలేజీలు కూడా..**

'ఫతి'బాటలోనే తెలంగాణ డిగ్రీ, పీజీ కాలేజీల యాజమాన్య సంఘం(టీపీడీపీఎంఏ) కూడా కాలే జీల బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ నెల 16 నుంచి కాలేజీలను మూసేస్తామని అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సూర్యనారాయణరెడ్డి, యా ద రామకృష్ణలు ప్రకటించారు. శుక్రవారం ఉన్నత విద్యామండలి కార్యాలయం ముందు ధర్నా చేపట్టి ప్రభుత్వ తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు.

**దసరా జరుపుకోలేని పరిస్థితులున్నాయి**

ముఖ్యమంత్రే విద్యాశాఖ మంత్రిగా ఉండటంతో విద్యకు తొలి ప్రాధాన్యత లభిస్తుందనుకున్నాం. కానీ అసలు ప్రాధాన్యతే లేకుండా పోయింది. రూ. 10 వేల కోట్ల బకాయిల విడుదల కోసం 6 నెలలుగా ప్రభుత్వం చుట్టూ తిరుగుతున్నాం. ప్రత్యామ్నాయ ప్రణాళికను సర్కారు ముందుంచాం. దసరా పండుగను సంతోషంగా జరుపుకోలేని పరిస్థితులున్నాయి. జీతాలు ఇవ్వకపోతే సోమవారం నుంచి విధులకు హాజరుకాబోమని సిబ్బంది తేల్చిచెప్పారు. తప్పనిసరి పరిస్థితుల్లో కాలేజీల నిరవధిక బంద్‌కు పిలుపునిచ్చాం. ఈ నెల 30లోగా ప్రభుత్వం బకాయిలు విడుదల చేయాలి.

**6 నెలలుగా వేతనాలు ఇవ్వలేకపోతున్నాం**

ప్రైవేటు కాలేజీల సిబ్బందికి 6 నెలలుగా వేతనాలు ఇవ్వలేకపోతున్నాం. యజమానులుగా మధ్యాహ్నం పూట కాలేజీకి వెళ్లలేకపోతున్నాం. సాయంత్రం, రాత్రిపూట వెళ్లి సంతకాలు పెట్టి వస్తున్నాం. బకాయిల విడుదల కోసం ఉప ముఖ్య మంత్రి భట్టిని నాలుగుసార్లు కలిశాం. ఇంజనీర్స్‌డేను బ్లాక్‌డేగా పాటించి, బంద్‌ను పాటించబోతున్నాం. ఆగస్టు 31 వరకు మాకు రావాల్సిన పూర్తి బకాయిలను విడుదల చేయాలి.

# ఆర్ఆర్ఆర్ ఎలైన్‌మెంట్ మార్చాలి

చౌటుప్పల్

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ డివిజన్ పరిధిలో ఆర్ఆర్ఆర్ ఎలైన్‌మెంట్‌ను ఓఆర్ఆర్ నుంచి 40 కిలోమీటర్లకు బదులు 28 కిలోమీటర్లకు కుదించడాన్ని నిరసిస్తూ భూనిర్వాసితుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. దీనికి అఖిలపక్ష నాయకులు మద్దతు తెలిపారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మునుగోడు మాజీ ఎమ్మెల్యేలు పల్లా వెంకట్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, భాజపా రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి ప్రసంగించి ఎలైన్‌మెంట్‌ను మార్చాలని రైతులు చేస్తున్న పోరాటానికి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా నెల్లికంటి సత్యం మాట్లాడుతూ భూనిర్వాసితులు కోల్పోయే భూమికి ప్రత్యామ్నాయంగా మరోచోట భూమిని కేటాయించి మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం చెల్లించాలన్నారు. భూనిర్వాసిత ఐక్య వేదిక కన్వీనర్ దామోదర్‌రెడ్డితో కలిసి ఆర్డీవో శేఖర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం బస్‌స్టేషన్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించడానికి భూనిర్వాసితులు సిద్ధమవగా పోలీసులు అనుమతి నిరాకరించారు. పోలీసులు అడ్డుకుంటున్నా రైతులు జాతీయ రహదారిపై ఎక్కడికక్కడ బైఠాయించి వాహనాల రాకపోకలు స్తంభింపజేసేందుకు ప్రయత్నించారు. పోలీసులు చివరికి ఆందోళనకారులు కొందరిని అదుపులోకి తీసుకుని తర్వాత వదిలేశారు. సుమారు గంట సేపు జాతీయ రహదారిపై ఉద్రిక్తత నెలకొంది.




## ఏం చెబుదాం!?

-మొదటిపేజీ తరువాయి

చేయాలంటూ సుప్రీం కోర్టునూ ఆశ్రయించింది. బీఆర్ఎస్ ఫిర్యాదుపై మూడు నెలల్లోగా చర్యలు తీసుకోవాలని గత నెల 25న సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో చర్యలకు ఉపక్రమించిన స్పీకర్.. వివరణ ఇవ్వాల్సిందిగా పది మంది ఎమ్మెల్యేలకూ నోటీసులు జారీ చేశారు. వీరిలో దానం నాగేందర్, కడియం శ్రీహరి మినహా మిగిలిన 8 మందీ స్పీకర్ కార్యాలయానికి వివరణ ఇచ్చారు. తాము పార్టీ మారలేదని, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగానే ఉన్నామని వివరణ ఇచ్చిన వారు.. దానికి సంబంధించిన ఆధారాలూ సమర్పించారు. దాంతో, విచారణకు పిలిచినప్పుడు హాజరై.. ఆయా కేసుల్లో బీఆర్ఎస్ తరఫున వాదనలు చెప్పాలంటూ ఆ పార్టీకి స్పీకర్ కార్యాలయం నోటీసులు ఇచ్చింది కూడా. అయితే వివరణ ఇచ్చేందుకు స్పీకర్‌ను దానం, కడియం కొంత గడువు కోరారు. కాంగ్రెస్ పార్టీ కార్యాచరణలో వారు పాల్పంచుకున్నట్లు స్పష్టమైన ఆధారాలున్న నేపథ్యంలో స్పీకర్‌కు ఇచ్చే వివరణపై న్యాయ నిపుణులతో వారు చర్చలు జరుపుతున్నారు. నిజానికి, బీఆర్ఎస్ టికెట్‌పై ఖైరతాబాద్ నుంచి గెలిచిన దానం నాగేందర్.. ఆ తర్వాత సీఎం రేవంత్ రెడ్డిని కలిసి మూడు రంగుల కండువా కప్పుకొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున సికింద్రాబాద్ నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఇక, స్టేషన్ ఘన్‌పూర్ నుంచి బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచిన కడియం శ్రీహరి.. లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన తన కుమార్తె కడియం కావ్య తరఫున బాహాటంగానే ప్రచారం చేశారు. ఈ నేపథ్యంలో స్పీకర్ నోటీసులకు 'ఏం చెప్పాలనే' అంశంపై వీరిద్దరూ న్యాయ నిపుణులతో చర్చలు జరుపుతున్నారు. ఇవి కొలిక్కి రావడానికి ఇంకాస్త సమయం పడితే.. స్పీకర్‌ను కలిసి మరికొంత గడువు కోరే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. అయితే, కొద్ది రోజులుగా జ్వరంతో బాధపడుతున్న శ్రీహరి ఇంటికే పరిమితమయ్యారని, కోలుకోగానే స్పీకర్‌కు ఇచ్చే వివరణపై దృష్టి పెడతారని ఆయన సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.

## దక్షిణాది కుంభమేళాలా గోదావరి పుష్కరాలు

-మొదటిపేజీ తరువాయి

ఘాట్లను విస్తరించాలి. రోడ్లు, ఇతర వసతులకు శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టాలి. పుష్కరాల ఏర్పాట్లకు కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలను సద్వినియోగం చేసుకోవాలి. స్వచ్ఛ భారత్, జల్ జీవన్ మిషన్‌లతోపాటు అందుబాటులో ఉన్న కేంద్ర పథకాలన్నింటితో సమన్వయం ఉండే పనులు గుర్తించి, వాటికి అవసరమైన అనుమతులు తీసుకోవాలి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని కేంద్రం నుంచి స్పెషల్ ప్యాకేజీ కోరేందుకు వీలుగా ఈ పనుల జాబితాను సిద్ధం చేయాలి. పర్యాటక, నీటి పారుదల, దేవాదాయ శాఖలు సమన్వయంతో పనిచేయాలి.

**ప్రధాన ఆలయాల అభివృద్ధికి ప్రాధాన్యం**

గోదావరి తీరంలోని ప్రధాన ఆలయాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యమివ్వాలి. శాశ్వత పుష్కర ఘాట్ల నిర్మాణం చేపట్టాలి. రెండో ప్రాధాన్యంగా పుష్కర స్నానాలకు వీలుగా ఉండే గోదావరి తీర ప్రాంతాలను అభివృద్ధి చేయాలి. బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి పరీవాహకంలోని ఆలయాలన్నింటినీ క్షేత్రస్థాయిలో సందర్శించి.. అవసరమైన అభివృద్ధి పనుల జాబితాను తయారు చేయాలి. మహాకుంభమేళా, వివిధ రాష్ట్రాల్లో పుష్కరాలు, ఆలయాల అభివృద్ధి, భక్తులకు సౌకర్యాల కల్పనలో అనుభవమున్న కన్సల్టెన్సీలను నియమించుకోవాలి. బాసర, కాళేశ్వరం, ధర్మపురి, భద్రాచలంతోపాటు గోదావరి తీరం వెంట ఉన్న ఆలయాలన్నింటినీ సందర్శించి విడివిడిగా ప్రాజెక్టు రిపోర్టులు సిద్ధం చేసుకోవాలి" అని అధికారులను సీఎం ఆదేశించారు.

## బొగ్గు బ్లాక్‌లు దక్కకపోవడంతో ఇబ్బందులు

-మొదటిపేజీ తరువాయి



బ్లాకులు దక్కకపోవడం, కొత్త బ్లాకులు కేటాయించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటోంది. కర్ణాటకలోని రాయచూర్, దేవదుర్గ్ బెల్ట్‌లో రాగి, బంగారం ఖనిజాల అన్వేషణలో సింగరేణి పాల్గొంది. రాగి, బంగారం మైనింగ్‌ను ఏ సంస్థ చేసినా సింగరేణికి 37.75శాతం రాయల్టీ వస్తుంది. కీలక ఖనిజాల వెలికితీతలో కూడా కేంద్రం సింగరేణి సంస్థకు అవకాశం కల్పించాలి. గ్రీన్ ఎనర్జీలో కూడా ఈ సంస్థ ప్రవేశించింది. పలు రాష్ట్రాల్లోని ఎన్టీపీసీలకు సింగరేణి బొగ్గు సరఫరా చేస్తోంది. మన రాష్ట్రంలో మరో 25 ఏళ్లకు సరిపడా మాత్రమే బొగ్గు నిల్వలు ఉన్నాయి. సింగరేణి సంస్థ వేలంలో పాల్గొనకపోతే బొగ్గు బ్లాక్‌లు ప్రైవేటు వ్యక్తులకు వెళ్తాయి. సత్తుపల్లి, కోయగూడెం బ్లాక్‌లు ఇప్పటికే ప్రైవేటు వ్యక్తులకు వెళ్లాయి" అని భట్టి విక్రమార్క వివరించారు. సింగరేణి సంస్థ వేలంలో పాల్గొనకపోతే బొగ్గు బ్లాక్‌లు ప్రైవేటు వ్యక్తులకు వెళ్తాయని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సత్తుపల్లి, కోయగూడెం బ్లాక్‌లు ఇప్పటికే ప్రైవేటు వ్యక్తులకు వెళ్లాయని గుర్తు చేశారు. అందుకే సింగరేణి సంస్థ వేలంలో పాల్గొనాలని సూచించారు. దాంతో సింగరేణిలో మరిన్ని ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని వివరించారు. సింగరేణి గ్రీన్ ఎనర్జీ స్టోరేజ్‌లో భాగస్వామ్యం అవుతోందని పేర్కొన్నారు. దేశానికి క్రిటికల్ మినరల్స్ అందించడంలో భాగస్వామ్యం ఉండాలనే లక్ష్యంతో సింగరేణి ముందుకు వెళ్తుందని భట్టి విక్రమార్క ధీమా వ్యక్తం చేశారు.

## బ్యాంకులో 5 లక్షలు కాజేసిన బాలుడు!




బోధన్

నిజామాబాద్ జిల్లా బోధన్ లోని భారతీయ స్టేట్ బ్యాంకు (ఎస్బీఐ)లో చోరీ జరిగింది. ఈ నెల 8న బ్యాంకులో రూ.5 లక్షలు చోరీకి గురైనట్లు క్యాషియర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు విచారణలో భాగంగా బ్యాంకులోని సీసీ కెమెరాల ఫుటేజీని చూసిన పోలీసులు విస్తుపోయారు. ఓ బాలుడు ఈ చోరీ చేసినట్లు గుర్తించారు. బ్యాంకులో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరగ్గా.. బాలుడు నగదు కౌంటర్ వైపు వెళ్లాడు. ఆ బాలుడే రూ.5 లక్షలు చోరీ చేసినట్లు నిర్ధారించామని పోలీసులు చెబుతున్నారు. అతనికి సహకరించిన వారికోసం సీసీ ఫుటేజీల ద్వారా విచారణ జరుపుతున్నట్లు చెప్పారు. ఈ విషయంపై పట్టణ సీఐని వివరణ కోరగా.. అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామని, త్వరలోనే నిందితులను పట్టుకుంటామని తెలిపారు.

# లోక్‌సభలోనే వారసులెక్కువ!

న్యూఢిల్లీ

దేశవ్యాప్తంగా శాసనసభల్లోకన్నా లోక్‌సభలోనే వారసుల సంఖ్య అధికంగా ఉందని, దేశంలో వారసత్వ రాజకీయాలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయని అసోసియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) తెలిపింది. 543 మంది లోక్‌సభ ఎంపీల్లో 167 మందికి.. అంటే, 31 శాతం మందికి వారసత్వ నేపథ్యం ఉండగా, 224 మంది రాజ్యసభ ఎంపీల్లో 47 మందికి (21 శాతం) వారసత్వ నేపథ్యం ఉన్నదని వెల్లడించింది. ఈ మేరకు ఏడీఆర్ శుక్రవారం ఒక నివేదికను విడుదల చేసింది. దీని ప్రకారం.. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల అసెంబ్లీల్లో 20% మంది ఎమ్మెల్యేలకు, శాసనమండలిల్లో 22% మంది ఎమ్మెల్సీలకు కుటుంబ వారసత్వం ఉంది. రాష్ట్రాలవారీగా చూస్తే ఉత్తరప్రదేశ్‌లోనే అత్యధికంగా వారసులు ఉన్నారు. ఆ రాష్ట్రానికి చెందిన 604 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల్లో 141 మంది వారసులే. యూపీ తర్వాతి స్థానాల్లో మహారాష్ట్ర (129 మంది), బిహార్ (96 మంది), కర్ణాటక (94 మంది) ఉన్నాయి. వారసుల విషయంలో తెలంగాణ 9వస్థానంలో ఉంది. తెలంగాణలో 176 మంది చట్టసభల సభ్యుల్లో 43 మంది (24%) రాజకీయ కుటుంబాల నుంచి వచ్చారు. 11 మంది ఎంపీలు వారసత్వ నేపథ్యం నుంచే వచ్చారు. వారిలో గడ్డం వంశీకృష్ణ, సురేష్ షెట్కార్, జీ నగేష్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, అసదుద్దీన్ ఒవైసీ, ఆర్ రఘురాం రెడ్డి, మల్లు రవి, కె రఘువీర్, ధర్మపురి అర్వింద్, డీకే అరుణ, కడియం కావ్య ఉన్నారు. ఈ జాబితాలో ఐదవ స్థానంలో ఉన్న ఏపీలో మొత్తం 255 మంది చట్టసభల సభ్యులు ఉండగా.. వారిలో 86 మంది (34%) వారసులేనని ఏడీఆర్ తేల్చింది. ఏపీకి చెందిన లోక్‌సభ ఎంపీల్లో ఎనిమిది మందికి రాజకీయ వారసత్వం ఉంది. వారిలో జీఎం హరీశ్, అవినాశ్‌రెడ్డి, మిథున్‌రెడ్డి, రామ్మోహన్‌నాయుడు, పుట్టా మహేష్ కుమార్, కేశినేని శివనాథ్, బైరెడ్డి శబరి, దగ్గుబాటి పురంధేశ్వరి ఉన్నారు.



కాగా, దేశవ్యాప్తంగా చట్టసభల సభ్యుల్లో వారసత్వ నేపథ్యం నుంచి వచ్చిన వారిలో మహిళలే ఎక్కువగా ఉండడం గమనార్హం. మొత్తం 4,665 మంది పురుష ప్రజాప్రతినిధుల్లో 856 మందికి (18%) వారసత్వ నేపథ్యం ఉంటే, 539 మంది మహిళా ప్రజాప్రతినిధుల్లో 251 మంది (47%) రాజకీయ కుటుంబాల నుంచి వచ్చిన వారు. దాదాపు అన్ని రాష్ట్రాల్లో వారసత్వంతో రాజకీయాల్లోకి వచ్చిన స్త్రీలు ఉన్నారని, వీరిలో అత్యధిక శాతం అంటే 69% మంది మహిళలు మహారాష్ట్రలో ఉన్నారని ఏడీఆర్ తెలిపింది. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కూడా ప్రజాప్రతినిధుల్లో 69 శాతం మహిళలు వారసులు అయితే, పురుషుల్లో 29% మంది మాత్రమే వారసత్వ నేపథ్యం ఉన్నవారు. తెలంగాణలో 64% మంది మహిళలు, 21% మంది పురుషులు వారసులేనని ఏడీఆర్ పేర్కొంది.

**కాంగ్రెసలో అత్యధికం**

పార్టీల వారీగా చూస్తే.. కాంగ్రెసలోనే అత్యధికంగా రాజకీయ వారసులు ఉన్నారు. జాతీయ పార్టీల్లోని మొత్తం 3,214 మంది ప్రజాప్రతినిధుల్లో కాంగ్రెసలో 32%, బీజేపీలో 18% మంది వారసత్వ నేపథ్యం నుంచి వచ్చినవారని ఏడీఆర్ వెల్లడించింది. ప్రాంతీయ పార్టీల్లోని 1809 మంది సిట్టింగ్ ప్రజాప్రతినిధుల్లో 406 మందికి వారసత్వ నేపథ్యం ఉంది. వైఎస్సార్‌సీపీలో 38 శాతం మంది, తెలుగుదేశంలో 36 శాతం మంది వారసులే. బీఆర్ఎసలోని 52 మంది ప్రజాప్రతినిధుల్లో 10 మందికి వారసత్వ నేపథ్యం ఉన్నదని ఏడీఆర్ పేర్కొంది.

# సుప్రీం ఆవరణలో ఫొటోలపై నిషేధం

న్యూఢిల్లీ

బాణసంచా నిషేధం ఒక్క ఢిల్లీ–దేశ రాజధాని ప్రాంతానికే పరిమితం చేయడం ఎందుకని, దానిపై జాతీయ విధానం రూపొందించవచ్చు కదా అని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. స్వచ్ఛమైన గాలి కేవలం రాజధానిలోని ఉన్నత వర్గాల వారికే పరిమితం కాకూడదని, దేశంలోని ప్రజలందరికీ అందుబాటులో ఉండాలి కదా అని వ్యాఖ్యానించింది. కొన్ని ప్రాంతాలకే పరిమితమయ్యే విధంగా విధానాన్ని రూపొందించడం ఏమిటని ప్రశ్నించింది. దీనిపై సీజేఐ జస్టిస్ గవాయ్ మాట్లాడుతూ తాను గత శీతాకాలంలో అమృత్‌సర్‌లో ఉన్నప్పుడు అక్కడ ఢిల్లీ కన్నా అధికంగా కాలుష్యం ఉండడాన్ని గమనించానని, అక్కడ మాత్రం బాణసంచాపై నిషేధం లేదని అన్నారు. “ఒక వేళ బాణసంచాను నిషేధిస్తే దానిని దేశమంతటా నిషేధించాలి” అని చెప్పారు. దీనిపై కోర్టు సహాయకురాలిగా వ్యవహరిస్తున్న అపరాజిత సింగ్ స్పందిస్తూ కాలుష్యం ఒక్క ఉన్నత వర్గాల సమస్య అని భావించడం సరికాదని చెప్పారు. ప్రజలంతా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అయినా ఢిల్లీలో కాలుష్యం పెరిగినప్పుడు ఉన్నతవర్గాల వారు వేరేచోటికి వెళ్లి ఎవరి జాగ్రత్తల్లో వారు ఉంటున్నారని అన్నారు. కేంద్రం తరపున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి సమాధానం ఇస్తూ ‘గ్రీన్ క్రాకర్స్’ ద్వారా కాలుష్యాన్ని తగ్గించే విషయమై జాతీయ పర్యావరణ ఇంజినీరింగ్ పరిశోధన సంస్థ (నీరి) అధ్యయనం చేస్తోందని తెలిపారు. ఈ సమస్యపై వాయు నాణ్యత నిర్వహణ కమిషన్ నుంచి సవివరమైన నివేదిక తెప్పించాలని ధర్మాసనం ఆమెకు సూచించింది. బాణసంచా తయారీదార్ల తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఎలాంటి రసాయన మిశ్రమాలను ఉపయోగించాలో ‘నీరి’ సూచిస్తే దానిని తప్పకుండా అమలు చేస్తామని తెలిపారు. మరో సీనియర్ న్యాయవాది కె.పరమేశ్వర్ మాట్లాడుతూ బాణసంచా తయారీపై ఆంక్షలు విధించడంతో పాటు 2028 వరకు మంజూరు చేసిన లైసెన్సులను కూడా అధికార్లు రద్దు చేస్తున్నారని చెప్పారు. బాణసంచా వ్యాపారుల



లైసెన్సుల రద్దుపై యథాతథ స్థితి కొనసాగుతుందని చెప్పిన ధర్మాసనం తదుపరి విచారణను 22కు వాయిదా వేసింది.

**సుప్రీం ఆవరణలో ఫొటోలపై నిషేధం**

సుప్రీంకోర్టు ప్రధాన ప్రాంగణంలో ఫొటోలు, వీడియోలు, రీల్స్ చేయడాన్ని నిషేధిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. దీన్ని ‘హై సెక్యూరిటీ జోన్’గా పరిగణించిన సుప్రీంకోర్టు.. అక్కడి లాన్‌లోకి కెమేరాలు, ట్రైపాడ్‌లు, సెల్ఫీ స్టిక్ వంటి పరికరాలను తీసుకెళ్లకూడదంటూ బుధవారం సర్క్యులర్ జారీ చేసింది.

బెయిల్ పిటిషన్లపై 2 నెలల్లోనే నిర్ణయం

బెయిల్ పిటిషన్లపై రెండు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు శుక్రవారం అన్ని హైకోర్టులకు సూచించింది. బెయిల్ పిటిషన్లను దీర్ఘకాలం పాటు పెండింగ్‌లో పెట్టడం న్యాయాన్ని నిరాకరించడం కిందకే వస్తుందని వ్యాఖ్యానించింది. దీనిపై అన్ని జిల్లా కోర్టులకు సూచనలు ఇవ్వాలని హైకోర్టులను ఆదేశించింది. కేసులోని మెరిట్ ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించింది.

**దివ్యాంగులకు జనరల్ కోటా వర్తింపును పరిశీలించండి**

ప్రతిభ చూపిన దివ్యాంగులకు జనరల్ కోటా వర్తింపుచేయడాన్ని పరిశీలించాలని సుప్రీంకోర్టు శుక్రవారం కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. ఎస్సీ, ఎస్టీలు ఎక్కువ మార్కులు సంపాదిస్తే వారికి జనరల్ కోటాలో సీట్లు ఇస్తున్నారని, అదే విధానాన్ని దివ్యాంగులకు కూడా అమలు చేయాలని అభిప్రాయపడింది. వారికి కేవలం దివ్యాంగుల కోటాలోనే సీట్లు ఇస్తామనడం వివక్ష కిందకే వస్తుందని తెలిపింది. దీనిపై అక్టోబరు 14లోగా సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. పదోన్నతుల్లోనూ ఈ విధానాన్ని అవలంబించాలని సూచించింది. తదుపరి విచారణను వచ్చే ఏడాది మార్చి 13కు వాయిదా వేసింది.

## ఉపరాష్ట్రపతిగా రాధాకృష్ణన్ ప్రమాణం

-మొదటిపేజీ తరువాయి

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీతోపాటు, కేంద్ర మంత్రులు పలువురు ఎన్డీయే కూటమి సీఎంలు, మాజీ రాష్ట్రపతులు, మాజీ ప్రధానులు, జగ్దీప్ ధన్‌ఖడ్ సహా మాజీ ఉపరాష్ట్రపతులూ పాల్గొన్నారు. ఉప రాష్ట్రపతి ఎన్నికకు ఈ నెల 9న జరిగిన పోలింగ్‌లో ఎన్డీయే కూటమి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ తన సమీప ప్రత్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిపై 152 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఎన్నిక లాంఛనాలన్నీ పూర్తి కావడంతో గురువారం మహారాష్ట్ర గవర్నర్ పదవికి సీపీ రాధాకృష్ణన్ రాజీనామా చేశారు. ఓటమి తర్వాత జస్టిస్ సుదర్శన్‌రెడ్డి రాధాకృష్ణన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. సీపీ రాధాకృష్ణన్ పూర్తి పేరు చంద్రపురం పొన్ను స్వామి రాధాకృష్ణన్. 1957 అక్టోబరు 20న తమిళనాడులోని తిరుప్పూర్‌లో ఆయన జన్మించారు. కాంగ్రెస్ సానుభూతిపరులైన వ్యవసాయ కుటుంబంలో ఈయన జన్మించారు. పదహారో ఏట నుంచి ఆర్ఎస్ఎస్, జన్‌సంఘ్‌లతో కలిసి పనిచేశారు. సామాజికంగా, ఆర్థికంగా బలమైన కొంగు వెల్లాలర్ (గౌండర్) సామాజికవర్గం నుంచి వచ్చిన ఆయన బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో బ్యాచిలర్స్ డిగ్రీ చేశారు. 1998 లోక్‌సభ ఎన్నికల్లో తమిళనాడులోని కోయంబత్తూరు స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా 1.5 లక్షల ఆధిక్యంతో విజయం సాధించారు. 1999 ఎన్నికల్లో అక్కడినుంచే నెగ్గారు. వాజ్‌పేయీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడే 2000లో రాధాకృష్ణన్ కేంద్రమంత్రి కావాల్సి ఉంది. మరో సీనియర్ నేత పొన్ రాధాకృష్ణన్ అప్పట్లో ఆ అవకాశాన్ని చేజిక్కించుకున్నారు. ఇద్దరి పేర్లూ ఒకటే కావడంతో అలాంటి పొరపాటు జరిగిందని చెబుతారు. చిన్న వయసులోనే ఆర్ఎస్ఎస్ భావజాలానికి ఆకర్షితులైన రాధాకృష్ణన్, తన 16వ ఏటనే రాజకీయాల్లోకి ప్రవేశించారు. తమిళనాడు బీజేపీలో కార్యదర్శిగా, అధ్యక్షుడిగా కీలక బాధ్యతలు నిర్వర్తిం చారు. 1998, 1999 లోక్‌సభ ఎన్నికల్లో కోయంబత్తూర్ నుంచి రెండుసార్లు ఎంపీగా గెలుపొందారు. తన అనుచరులు ఆయన్ను ‘తమిళనాడు మోదీ’ అని పిలుచుకుంటారు. మహారాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టడానికి ముందు ఆయన జార?ండ్ గవర్నర్‌గా, తెలంగాణ ఇన్‌చార్జి గవర్నర్‌గా, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గానూ సేవలు అందించారు. ఇక.. 1996లో తమిళనాడు బీజేపీ కార్యదర్శిగా పనిచేశారు. 2004 నుంచి 2007 వరకు బీజేపీ అధ్యక్షుడిగా పనిచేశారు. 2014, 2019 ఎన్నికల్లో ఓడిపోయారు. అయినప్పటికీ పార్టీలో ‘తమిళనాడు మోదీ’గా ఈయన పేరుపొందారు. ఆపై.. రాధాకృష్ణన్ 2023 ఫిబ్రవరి 12న జార?ండ్ గవర్నర్‌గా నియమితులయ్యారు. కొన్నాళ్లు తెలంగాణ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు చేపట్టారు. 2024 జులై 27 నుంచి మహారాష్ట్ర గవర్నర్‌గా ఉండి.. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో నెగ్గడంతో ఆ హోదాకు రాజీనామా చేశారు. సర్వే పల్లి రాధాకృష్ణన్, ఆర్.వెంకటరామన్‌ల తర్వాత తమిళనాడు నుంచి ఉపరాష్ట్రపతి పీఠాన్ని అధిరోహించిన మూడోవ్యక్తిగా, దక్షిణాది నుంచి ఏడో వ్యక్తిగా రికార్డులకెక్కారు. ఉపరాష్ట్రప తిగా ఆయన పదవీకాలం 2030 వరకు ఉంటుంది.

## 5 రాష్ట్రాల్లో మోదీ పర్యటన

న్యూఢిల్లీ

ప్రధాని మోదీ మణిపూర్ సహా ఐదు రాష్ట్రాల్లో పర్యటించనున్నారు. శనివారం నుంచి సోమవారం వరకు మిజోరం, మణిపూర్, అసోం, పశ్చిమ బెంగాల్, బిహార్‌లో పర్యటిస్తారని, రూ.71,850 కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారని ప్రధాని కార్యాలయం(పీఎంవో) శుక్రవారం వెల్లడించింది. మణిపూర్‌లో 2023 మేలో జాతుల మధ్య వైరంతో హింస చెలరేగిన తర్వాత ప్రధాని మోదీ ఆ రాష్ట్రంలో పర్యటించనుండడం ఇదే తొలిసారి. మూడు రోజుల పర్యటనలో భాగంగా మోదీ తొలుత శనివారం మిజోరం వెళ్లనున్నారు. ఐజ్వాల్‌లో ఉదయం రూ.9 వేల కోట్ల విలువైన పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారు. అక్కడి నుంచి మణిపూర్ చేరుకొని.. చురచాంద్‌పూర్‌లో మధ్యాహ్నం రూ.7,300 కోట్ల విలువైన పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు. తర్వాత రాజధాని ఇంఫాల్‌లో రూ.1,200 కోట్ల ప్రాజెక్టులను ప్రారంభిస్తారు. అక్కడ బహిరంగ సభలో పాల్గొన్న తర్వాత అసోం వెళ్తారు. సాయంత్రం గువాహటిలో జరిగే భారతరత్న భూపేన్ హజారికా శత జయంతి ఉత్సవాల్లో పాల్గొంటారు. 14వ తేదీన ప్రధాని మోదీ అసోంలో రూ.18,530 కోట్ల కీలకమైన మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు. తర్వాత అస్సాం బయో–ఇథనాల్ ప్రైవేట్ లిమిటెడ్ రిఫైనరీ ప్లాంట్‌ను ప్రారంభిస్తారు. 15న పశ్చిమబెంగాల్‌లో ప్రధాని పర్యటించి, కోల్‌కతాలో జరిగే 16వ కంబైన్డ్ కమాండర్స్ కాన్ఫరెన్స్–2025ను ప్రారంభించనున్నారు. ఆ తర్వాత బిహార్ వెళ్లి.. పూర్ణియా విమానాశ్రయం కొత్త టెర్మినల్ భవనాన్ని ప్రారంభిస్తారు. అనంతరం పూర్ణియాలో దాదాపు రూ.36 వేల కోట్ల విలువైన పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు.

# ఈశాన్యాన వెలుగు రేఖ!

**మిజోరంలో ఇంజనీరింగ్ అద్భుతం.. కొండలు, లోయల గుండా రైల్వేలైన్ నిర్మాణం**

**రాజధాని ఐజ్వాల్‌కు ఇక రైళ్ల పరుగు.. బైరాబి–సాయ్‌రంగ్ లైన్‌కు నేడు ప్రధాని ప్రారంభం**



ఆకాశానికి నిచ్చెన వేస్తున్నట్టు అంతెత్తు పిల్లర్.. అది కూడా మామూలుగా కాదు.. అత్యంత ఎత్తైన రాతి కట్టడం కుతుబ్‌మినార్ (72 మీటర్లు) కంటే మరో 42 మీటర్లు ఎత్తున్న 114 మీటర్ల అతి భారీ పిల్లర్.. దానిపై ఇంజనీరింగ్ నైపుణ్యానికి అద్దం పట్టే ఇనుప బ్రిడ్జి.. కిందికి చూస్తే కళ్లు తిరిగే లోయ.. దాటి కాస్త ముందుకెళితే మరికొన్ని భారీ వరుస బ్రిడ్జిలు.. ఒక దాని వెంట ఒకటిగా వచ్చే పొడవాటి టన్నెళ్లు.. ఈశాన్య భారతాన సరికొత్త వెలుగురేఖలా పేర్కొనదగ్గ బైరాబి–సాయ్‌రంగ్ రైల్వే లైన్‌పై వెళుతున్నప్పుడు కనిపించే అద్భుతాలివి.. మిజోరం రాజధాని ఐజ్వాల్‌కు రైల్ కనెక్టివిటీ కోసం నిర్మించిన ఈ లైన్‌ను ప్రధాని మోదీ శనివారం స్వయంగా ప్రారంభించబోతున్నారు.

ఐజ్వాల్.. మిజోరం రాజధాని. ఎటు చూసినా పచ్చని అడవులతో నిండిన కొండలు. అగాధాలను తలపించే లోయలు. ఆ లోయల్లో జలజల పారే నీటి హొయలు. ప్రతి కొండ అంచున ప్రజల ఆవాసం. చదునైన ప్రాంతం ఉన్నా లేకున్నా, ప్రకృతి సవాళ్లకు ఎదురీదే రీతిలో లోయలోకి ఎప్పుడు జారిపోతాయో అనేలా నిర్మించిన ఇళ్లు. 20–25 అడుగుల లోతు నుంచి వేసిన కాంక్రీట్ పిల్లర్లు లేదా పొడవాటి వెదురు దుంగలతో నిర్మించిన ఇళ్లే ఆవాసం. కొండ అంచుకు, ఆ ఇళ్లకు మధ్య నుంచి వేసిన రోడ్లే ప్రయాణ మార్గాలు. ఇన్ని ప్రకృతి సవాళ్ల మధ్య జీవనం సాగించే ఐజ్వాల్ వాసుల జీవితాల్లో సరికొత్త వెలుగు రేఖ బైరాబి–సాయ్‌రంగ్ రైల్వే లైను. ఇళ్లు, రోడ్లు నిర్మించడమే సవాల్‌గా ఉండే మిజోరం లో నిర్మించిన 51.38 కిలోమీటర్ల ఈ లైను ఒక ఇంజనీరింగ్ అద్భుతమనే చెప్పాలి.

**11 ఏళ్ల సుదీర్ఘ యజ్ఞం**

అన్ని రాష్ట్రాల రాజధానులనూ రైల్ నెట్‌వర్క్‌తో కలపాలన్న లక్ష్యంలో భాగంగా మిజోరం రాజధాని ఐజ్వాల్‌కు రైల్వే లైన్ వేసే ప్రాజెక్టుకు ప్రధాని మోదీ 2014లో శంకుస్థాపన చేశారు. అప్పటిదాకా మిజోరంలోని బైరాబి వరకు మాత్రమే రైల్వే లైను ఉండేది. అసోం సరిహద్దుకు సమీపంలోని ఈ స్టేషన్ వరకు లైన్ ఉన్నప్పటికీ మిజోరం ప్రజలకు పెద్దగా ఉపయోగం లేదనే చెప్పాలి. అందుకే రాజధాని ఐజ్వాల్‌ను కలిపే లక్ష్యంతో ఈ బైరాబి నుంచి ఐజ్వాల్ పక్కనుండే సాయ్‌రంగ్‌కు లైన్ వేసే యజ్ఞాన్ని తలపెట్టారు. కానీ ఈ మార్గం పొడవునా ఎత్తైన కొండలు, భారీ లోయలే ఉన్నాయి. వాటన్నింటి మధ్య నుంచి ఎత్తుపల్లాల్లేకుండా సమాంతరంగా రైల్వే లైన్ నిర్మించడమంటే ఎన్నో వ్యయ ప్రయాసలతో కూడుకున్న పనే. రూ.5 వేల కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు పూర్తయ్యే సరికి రూ.8 వేల కోట్లకు పైగా ఖర్చయ్యింది.

**ఎన్నెన్నో సవాళ్లు!**

మైదాన ప్రాంతంలో ఓ కొత్త రైల్వే లైను నిర్మించడానికే ఏళ్లకు ఏళ్లు పట్టడం మనం చూస్తుంటాం. అలాంటిది పూర్తిగా కొండలు, లోయలతో నిండి ఉన్న ప్రాంతంలో ప్రాజెక్టు అంటే ఇక చెప్పేదేముంది. కొండలను తొలిచి టన్నెల్స్ నిర్మించి, వందల అడుగుల లోతున్న లోయల నుంచి పిల్లర్స్ వేసి భారీ గర్డర్స్‌తో బ్రిడ్జిలు కడితే గానీ ముందుకు సాగని ప్రాజెక్టు ఇది. పైగా మిజోరంలో ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు వర్షాలు పడుతూనే ఉంటాయి. అంటే ఏడాదిలో నవంబరు నుంచి మార్చి వరకు 5 నెలలు మాత్రమే పనులు సాగేవి. ఇక వంతెనలు, టన్నెల్స్ నిర్మించాలంటే భారీ యంత్ర సామగ్రిని తరలించాలి. ఇది మరో సవాల్. వాటి తరలింపు కోసం ఏకంగా 200 కిలోమీటర్ల మేర రోడ్లు నిర్మించాల్సి వచ్చింది. ఈ భారీ ప్రాజెక్టుకు ఇసుక, కంకరతో సహా దాదాపు నిర్మాణ సామగ్రి మొత్తాన్ని అసోం, పశ్చిమ బెంగాల్, బిహార్, జార?ండ్ తదితర రాష్ట్రాల నుంచి తరలించాల్సి రావడం మరో సవాల్.

**ఇంజనీరింగ్ అద్భుతం!**

బైరాబి–సాయ్‌రంగ్ లైన్ మొత్తం పొడవులో 54% మేర బ్రిడ్జిలు, టన్నెల్సే ఉంటాయంటే ఇదెంత కష్టసాధ్యమైన ప్రాజెక్టు అనేది అర్థం చేసుకోవచ్చు. చిన్నవాటిని పక్కనపెట్టినా 55 ఎత్తైన బ్రిడ్జిలు కట్టారు. మరీ ముఖ్యంగా ఈ కొండ అంచు నుంచి ఆ కొండ అంచుకు మధ్యలో ఉన్న లోయ మీదుగా బ్రిడ్జిలు వేయడానికి దాదాపు ఆరుచోట్ల అతి ఎత్తైన పిల్లర్లు వేయాల్సి వచ్చింది. 70 మీటర్ల నుంచి 114 మీటర్ల ఎత్తున్న పిల్లర్లు నిర్మించి, వాటిని కలుపుతూ ఇనుప గర్డర్లతో వేసిన ఆ బ్రిడ్జిలను చూస్తే ఇంజనీర్ల శ్రమ కళ్లకు కట్టినట్లు కనిపిస్తుంది. అన్నిటికంటే ఎత్తైన 144వ నంబరు బ్రిడ్జి సాయ్‌రంగ్ స్టేషన్‌కు సమీపంలోనే ఉంది. మొత్తం 5 పిల్లర్లు ఉండగా, ఒక దాని ఎత్తు 114 మీటర్లు (374 అడుగులు). దేశంలోని రైల్వే ప్రాజెక్టుల్లో నిర్మించిన అతి ఎత్తైన పిల్లర్లలో ఇది రెండవది. మణిపూర్‌లో ఉన్న అతి భారీ పిల్లర్ ఎత్తు 141 మీటర్లు. ఇక కొండలను తొలుస్తూ వేసిన టన్నెల్స్ పొడవు మొత్తం లైన్‌లో 31 శాతం.

**మారనున్న ముఖచిత్రం!**

బైరాబి–సాయ్‌రంగ్ రైల్వే లైన్‌ను ఐజ్వాల్‌కు గేమ్ చేంజర్‌గా భావిస్తున్నారు. రాజధానికి రైల్ కనెక్టివిటీ ఏర్పడటంతో అభివృద్ధి కొత్త పుంతలు తొక్కనుంది. ముఖ్యంగా సరుకు రవాణా పెరగడంతో నిత్యావసరాల ధరలు తగ్గి ప్రజలకు పెద్ద ఊరట లభిస్తుంది. అలాగే మిజోరంలో విరివిగా లభించే అటవీ ఉత్పత్తులకు, ఉద్యాన ఉత్పత్తులకు, అక్కడ తయారయ్యే కళాకృతులకు బయటి మార్కెట్లు అందుబాటులోకి వస్తాయి. ఈ లైన్‌ను శనివారం ప్రధాని మోదీ ప్రారంభించగానే ఏకంగా ఢిల్లీకి కూడా రాజధాని ఎక్స్‌ప్రెస్ అందుబాటులోకి రావడం మిజోరం యువత ఉద్యోగావకాశాలను పెంచే అంశమే. ఇక పచ్చటి అందాలతో అలరారుతూ, ఏడాదిలో అత్యధిక కాలం జల్లులు పడుతుండే మిజోరంలో పర్యాటకం కొత్త పుంతలు తొక్కేందుకూ మార్గం సుగమమవుతుంది. తెలుగు రాష్ట్రాలతో సహా దేశంలోని పలు ప్రాంతాల పర్యాటకులు ఇకపై ఐజ్వాల్‌నూ తమ పర్యాటక గమ్యంగా ఎంచుకునే అవకాశముంది.

# త్రిబుల్ ఆర్ రైతుల పోరాటానికి అండగా ఉంటాం...!







-త్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని చౌటుప్పల్ ఆర్డీవో కార్యాలయం ముట్టడి

-ప్రభుత్వం తక్షణమే ఉత్తర భాగం అలైన్‌మెంట్‌ను ఓఆర్ఆర్ కు 40 కి.మీ వద్దకు మార్చాలి: ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

-భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలి: చెరుపల్లి సీతారాములు

-కోమటిరెడ్డి బ్రదర్స్ కి పాలాభిషేకం చేస్తాం: గంగిడి మనోహర్ రెడ్డి

-రైతులకు అన్యాయం జరిగితే యుద్ధమే : మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి

-అలైన్ మెంట్ మార్పు అనేదే పెద్ద మోసం:పల్లా వెంకట్ రెడ్డి

**చౌటుప్పల్, సెప్టెంబర్ 12, ప్రభాత సూర్య :** యదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో, రీజినల్ రింగ్ రోడ్ త్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని డిమాండ్ చేస్తూ రైతులు, భూ నిర్వాసితులు శుక్రవారం ఆర్డీఓ కార్యాలయాన్ని ముట్టడించారు. అలైన్‌మెంట్‌లో మార్పుల కారణంగా తమ విలువైన భూములను కోల్పోతున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఉన్న అలైన్‌మెంట్‌ను మార్చి, కొత్తగా నిర్ణయించడం వల్ల చౌటుప్పల్, భువనగిరి వంటి అభివృద్ధి చెందిన ప్రాంతాలలో తమ భూములకు నష్టం జరుగుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రీజనల్ రింగ్‌రోడ్ అలైన్‌మెంట్‌ను కొన్ని ప్రైవేట్ కంపెనీలకు లబ్ధి చేకూర్చేలా మార్చారని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గతంలోనే ఆరోపించారని రైతులు గుర్తు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను సంప్రదించి ఒక అలైన్‌మెంట్‌ను ఖరారు చేయగా, ప్రస్తుత ప్రభుత్వం దానిని మార్చిందని వికారాబాద్ జిల్లాలోని నవాబుపేట మండల రైతులు కూడా ఆరోపించారు. చౌటుప్పల్‌లోని వివిధ గ్రామాల రైతులు ఆర్డీఓ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. కార్యాలయం లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా, పోలీసులు వారిని అడ్డుకున్నారు. భూమికి భూమిని కేటాయించాలని లేదా మార్కెట్ ధర ప్రకారం పూర్తి నష్టపరిహారం చెల్లించిన తర్వాతే భూములు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. అభ్యంతరాల స్వీకరణ తర్వాత, రాజకీయ నాయకులను కలిసి తమ సమస్యను వివరించాలని నిర్వాసితులు భావిస్తున్నారు. ఈ సమస్య పరిష్కారం కాకపోతే దశలవారీగా ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. నిరసన సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఆర్డీఓ కార్యాలయం వద్ద పోలీసులు భారీగా మోహరించారు. ఉత్తర భాగం అలైన్‌మెంట్ ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ రైతులు యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ ఆర్డీవో కార్యాలయాన్ని భూ నిర్వాసితులు శుక్రవారం ముట్టడించి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. త్రిబుల్ ఆర్ ప్రాజెక్ట్ కింద భూములు, ప్లాట్లు కోల్పోతున్న చౌటుప్పల్, వలిగొండ, సంస్థాన్ నారాయణపురం, గట్టుప్పల్ , భువనగిరి మండలాలకు చెందిన భూ నిర్వాసితులు వందలాది మంది ఆర్డీవో కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన చేపట్టారు. "త్రిబుల్ ఆర్ వద్దురా..వ్యవసాయ భూములే ముద్దురా" అనే నినాదాలతో ఆ ప్రాంతం దద్దరిల్లిపోయింది. భూ నిర్వాసితుల ధర్నాకు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మునుగోడు మాజీ ఎమ్మెల్యేలు పల్లా వెంకట్ రెడ్డి, మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, సీపీఎం మాజీ కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగిడి మనోహర్ రెడ్డిలు భూ నిర్వాసిత రైతులకు మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ... ప్రభుత్వం తక్షణమే ఉత్తర భాగం అలైన్‌మెంట్‌ను ఓఆర్ఆర్ కు 40 కి.మీ వద్దకు మార్చి రైతులకు న్యాయం చేయాలన్నారు. తాము అభివృద్ధికి వ్యతిరేకం కాదు కానీ.. పేదల భూములు కొల్లగొడుతూ పెద్దలను కాపాడే కుట్రలకే తాము వ్యతిరేకమన్నారు. ఓఆర్ఆర్ నుండి త్రిబుల్ ఆర్ నిర్మాణానికి చౌటుప్పల్ వద్ద కేవలం 28 కిలోమీటర్ల దూరంలోనే అలైన్‌మెంట్ ఖరారు చేయడం వల్ల చౌటుప్పల్, భువనగిరి వంటి అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో విలువైన భూములను రైతులు కోల్పోతున్నారని తెలిపారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే భూమికి భూమి లేదంటే మార్కెట్ ధర ప్రకారం పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించిన తర్వాతే భూములను తీసుకోవాలని అన్నారు. గతంలో చేసిన అలైన్మెంట్ను మార్చడంలో ఎవరికి లబ్ధి చేకూరుస్తున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తరతరాలుగా భూములు సాగు చేసుకుంటున్నా రైతులు తమ భూములు త్రిబుల్ ఆర్ నిర్మాణంలో కోల్పోతున్నామని తెలిసి తీవ్రమైన మనస్థాపానికి గురై ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ప్రజల పక్షణం ఉండాల్సిన ప్రభుత్వాలు కార్పొరేట్ల వైపు మొగ్గు చూపటం సిగ్గుచేటని ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేసుకొని త్రిబుల్ ఆర్ కు వాస్తవ దూరంలో అలైన్మెంట్ను రూపొందించాలని, లేనియెడల రైతులు చేసే పోరాటానికి తమ పార్టీ ముందుంటుందని వారు అన్నారు.-అలైన్ మెంట్ మార్పు అనేదే పెద్ద మోసం: మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి.... ప్రభుత్వాలు అనేవి న్యాయబద్ధంగా వ్యవహరించాలని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక మాట, అధికారంలో ఉన్నప్పుడు ఇంకో మాట మాట్లాడడం సరైనది కాదని మునుగోడు మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి అన్నారు. దివిస్ పరిశ్రమకు అనుకూలంగా పాలకవర్గం పనిచేయడం చాలా దారుణమని విమర్శించారు. అంతటా 40 కిలోమీటర్లకు భూసేకరణ చేసిన ప్రభుత్వం దివిస్ పరిశ్రమ కోసం అలైన్‌మెంట్ నే మార్చడం శోచనీయమన్నారు. తక్షణమే అలైన్‌మెంట్ మార్చి పేద రైతులకు ప్రభుత్వం న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.-భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలి: చెరుపల్లి సీతారాములు...త్రిబుల్ ఆర్ నిర్మాణంలో భూసేకరణ చట్టం ప్రకారం భూమికి భూమి, మార్కెట్ రేట్ ప్రకారం నష్టపరిహారం, ప్లాట్లు ఇళ్ల స్థలాలు కోల్పోతున్న వారికి ఇల్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని చెరుపల్లి సీతారాములు డిమాండ్ చేశారు. పెద్దలను కాపాడడం కోసం ప్రభుత్వ పెద్దలు పేదలకు అన్యాయం చేస్తున్నారని ఆయన విమర్శించారు. -కోమటిరెడ్డి బ్రదర్స్ కి పాలాభిషేకం చేస్తాం: గంగిడి మనోహర్ రెడ్డి... ఉత్తర భాగం త్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చి పేద రైతులకు న్యాయం చేస్తే కోమటిరెడ్డి బ్రదర్స్ కు పాలాభిషేకం చేస్తామని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్ రెడ్డి అన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి అనే ఇద్దరు అన్నదమ్ములు చెరో దారిలో వెళ్లడం సరైన పద్ధతి కాదని గంగిడి మనోహర్ రెడ్డి అన్నారు. ఒకాయన మంత్రి, ఇంకొకాయన మంత్రి పదవి కోసం ఎదురు చూస్తున్న వ్యక్తి వీరిలో ఏ ఒక్కరు తలుచుకున్నా త్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్ వెంటనే మార్పించవచ్చని అన్నారు. ప్రతిపక్ష లో ఉన్నప్పుడు రైతులకు అనుకూలంగా మాట్లాడిన కోమటిరెడ్డి బ్రదర్స్ ఇప్పుడు భూ నిర్వాసితులకు ఎందుకు న్యాయం చేయాలనే ఆలోచన చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. -రైతులకు అన్యాయం జరిగితే యుద్ధమే: మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి.... ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా రైతులను మోసం చేస్తే ఎంతటి పోరాటానికైనా సిద్ధమని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి హెచ్చరించారు. భూనిర్వాసితులకు మార్కెట్ విలువ కంటే 3 రేట్లు ఎక్కువ నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూములు కోల్పోతున్న రైతులకు గోల్డెన్ ఫారెస్ట్ భూములు కొనుగోలు చేసి ఇవ్వాలని.. మునుగోడు ఎమ్మెల్యే.. ఆయన అన్న మంత్రి రైతులను మోసం చేయడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. దివిస్ పరిశ్రమ వాళ్లు వేసే ఎంగిలి మెతుకులకు ఆశపడి రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. జాతీయ రహదారిపై -రాస్తారోకో....నాయకుల అరెస్టుతో పరిస్థితి ఉద్రిక్తం: త్రిబుల్ ఆర్ భూ నిర్వాసితులు చేపట్టిన ధర్నా.. జాతీయ రహదారిపై రాస్తారోకో ఉద్రిక్తతకు దారి తీసింది. త్రిబుల్ ఆర్ నిర్మాణంలో ఉత్తర భాగానికి అలైన్‌మెంట్ మార్చాలని డిమాండ్ చేస్తూ రైతులు, ప్లాట్ల యజమానులు శుక్రవారం చౌటుప్పల్ ఆర్డీవో కార్యాలయాన్ని ముట్టడించి ధర్నా చేసిన అనంతరం రైతులు చౌటుప్పల్ లోని 65వ నెంబరు జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. అప్పటికే భారీగా మోహరించిన పోలీసులు రైతులు చేపట్టిన రాస్తారోకో కార్యక్రమాన్ని అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. పోలీసులు ఏర్పాటు చేసిన భారీ గేట్లను తొలగించి జాతీయ రహదారిని త్రిబుల్ ఆర్ బాధిత రైతులు దిగ్బంధం చేశారు. జాతీయ రహదారిపై రైతులు బైఠాయించగా పోలీసులు వారిని అరెస్టు చేసి స్టేషన్కు తరలించారు. రైతులు, పోలీసుల మధ్య స్వల్ప తోపులాట జరిగింది. తమకు న్యాయం జరిగేంత వరకు ఆందోళన కొనసాగిస్తామని రైతులు తెలిపారు. భూ నిర్వాసితులు, అఖిలపక్ష కమిటీ నాయకులను పోలీసులు అరెస్టు చేయడంతో జాతీయ రహదారిపై

# పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పోరేషన్

కమిషనర్ శరత్ చంద్ర

**గండిపేట్, : సూర్యా ప్రతినిధి** మన పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్ శరత్ చంద్ర అన్నారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో కమీషనర్ బి.శరత్ చంద్ర పాల్గొన్నారు. కార్పోరేషన్ పరిధిలోని 22 వార్డులలో అధికారులు ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు, ఇందులో భాగంగా దోమల వల్ల కలిగే మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధులు నివారించేందుకు దోమలు వృద్ధి చెందే ప్రదేశాలు అయిన పుల కుండీలు, కూలర్లు, కొబ్బరి బొండాలు, పాత టైర్లలో నిల్వ ఉన్న నీటి పారవేశారు. దీని వల్ల దోమ లార్వ దశ విచ్చినం అయి దోమల ఎదుగుదల నశిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమం వారానికి ఒక సారి ప్రతి శుక్రవారం జరుగుతుందని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీ ఎస్ఐ జీ. వెంకట్ రెడ్డి, సూపర్ వైజర్ అధికారులు, వార్డు సిబ్బంది పాల్గొన్నారు.







# మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం

పెన్షన్ దారులకు ఆరువేలు ఇస్తానని

చెప్పి గద్దెనెక్కిన సీఎం రేవంత్ రెడ్డి

మహా ధర్నాలను విజయవంతం

చేయాలి ः రావుగళ్ళ బాబు మాదిగ

**మహేశ్వరం ప్రతినిధి (ప్రభాత సూర్య)** ఈ నెల 15న మండల కేంద్రాల్లో తహసీల్దార్ కార్యాలయం ముందు ఈ పెన్షన్ పెంచాలని వికలాంగులకు మరియు చేయూత పెన్షన్ దారుల మహాధర్నా ఈ నెల 20న గ్రామ పంచాయతి ముందు పెన్షన్ దారులు మహాధర్నా చేయాలని రావుగాళ్ళ బాబు మాదిగ ఏం ఎస్ పి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులుపిలుపునిచ్చారు. వికలాంగుల పెన్షన్ రూ 6 వేలకు వృద్దులు, వితంతువులు, ఒంటరి మహిళలు, మరియు అన్ని రకాల చేయూత పెన్షన్లు రూ 4 వేలకు పెంచాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఉద్యమంలో భాగంగా ఈ నెల 15న మండల తహసీల్దార్ కార్యాలయం ముందు జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని ఏం ఎస్ పి జిల్లా అధ్యక్షులు రావుగాళ్ళ బాబు మాదిగ కోరారు. తుక్కుగూడా శ్రీకాళశ్రీ గార్డెన్ లో ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పెంటనోళ్ళ మాదిగ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించచారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రావుగళ్ళ బాబు మాదిగ మాట్లాడుతూ ..ఆంధ్రపదేశ్ రాష్ట్రంలో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వికలాంగుల పెన్షన్ ఆరు వేలకు పెంచి ఇస్తున్నాడు.కానీ తెలంగాణలో ఆరు వేలు ఇస్తానని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వికలాంగులను మోసం చేశాడని అన్నారు.2023 ఎన్నికల సమయంలో వికలాంగుల పెన్షన్ 6 వేలు ,మిగితా చేయూత పెన్షన్ దారుల పెన్షన్ రూ నాలుగు వేలకు పెంచుతామని రేవంత్ రెడ్డి బహిరంగంగా హామీ ఇచ్చారు. ఈ నెల ఓటు వేయండి,వచ్చే నెల పెరిగే పెన్షన్ తీసుకొండని మాట్లాడిన రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పదవి చేపట్టి 20 నెలలు దాటినా ఒక్క రూపాయి కూడా పెంచలేదని అన్నారు.ఇది ఘోరమైన మోసం అని వ్యాఖ్యానించారు. ఈ మోసం గురించి ప్రతిపక్షాలు కూడా మాట్లాడకుండా చేయూత పెన్షన్ దారులకు అన్యాయం చేస్తున్నాయని అన్నారు.కాబట్టే 50 లక్షల మంది పెన్షన్ దారుల పక్షాన మంద కృష్ణ మాదిగ పోరాటానికి శ్రీకారం చుట్టారని అన్నారు.అందులో భాగంగా ఈ నెల 15న అన్ని మండలాల పరిధిలో ఉన్న అన్ని గ్రామాల నుంచి వికలాంగులు మరియు చేయూత పెన్షన్ దారుల మహాధర్నలను విజయవంతం చేయాలి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో రావుగళ్ళ బాబు మాదిగ ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షులు పెంటనోల్ల నరసింహ మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు బక్కని రవి మాదిగ మహేశ్వరం నియోజవర్గ ఇన్చార్జ్ బోధ్ర రవి మాదిగ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఫరూక్నగర్ ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షులు నాగభూషణ్ మాదిగ ఎంఎస్పి మహేశ్వరం మండల అధ్యక్షులు ఎర్ర కృష్ణ మాదిగ నందిగామ మండల అధ్యక్షులు చేన్నగల శ్రావణ్ కుమార్ మాదిగ కొత్తూరు మండల అధ్యక్షులు చేన్నగల న్నగల్లు అశోక్ కుమార్ ఆమంగల్ మండల అధ్యక్షులు కావలి శ్రీశైలం మాదిగ మహేశ్వరం మండల అధ్యక్షులు ఎర్ర గణేష్ మాదిగ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఎర్ర నవీన్ కుమార్ మాదిగ ఎమ్మార్పీఎస్ నాయకులు కల్లేపల్లి బాల్రాజ్ నడి కూడా అర్జున్ జి ఆర్ దానయ్య మాదిగ ఎర్ర అనీష్ కుమార్ మాదిగ పాల్గొన్నారు.



## రేషన్ నిర్వహణ చేతకాకపోతే రాజీనామా చేయండి



**మర్రిగూడ సెప్టెంబర్ 12 (ప్రభాత సూర్య)** మర్రిగూడమండల కేంద్రంలో శుక్రవారం , రాష్ట్ర విజిలెన్స్ బృందంతో కలిసి రేషన్ షాపులు తనిఖీ నిర్వహించారు, ఈ సందర్భంగా పౌర సరఫరా శాఖ ఎన్ఫో మెంట్ డిటి మార్చన రఘునందన్, డీలర్లను హెచ్చరించాడు గ్రామాలలో, సరైన పద్ధతిలో రేషన్ సరుకులు సరఫరా చేయాలని, రేషన్ బియ్యం పక్కదారి పట్టినట్లయితే, ప్రజలకు ఇబ్బందులు జరుగుతే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు, రేషన్ డీలర్లు సరైన నిర్వహణ చేతకాకపోతే వెంటనే రాజీనామా చేయాలని హెచ్చరికలు జారీ చేశారు

## రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి



**ఖమ్మం/అక్షిత బ్యూరో :**మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ లో రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు. శుక్రవారం మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ ను అదనపు కలెక్టర్ సందర్శించి సౌకర్యాలను పరిశీలించారు. నూతన యార్డు నిర్మాణం పూర్తి అయిన సందర్భంలో కార్యాలయ భవనము, మార్కెట్ యార్డు నిర్మాణాలు పరిశీలించి క్రయ, విక్రయాలకు చేసిన ఏర్పాట్లను తనిఖీ చేశారు. ఇంకనూ అవసరం ఉన్న వసతులను త్వరగా ఏర్పాటు చేసుకొని మార్కెట్ ను వినియోగదారులకు అందుబాటులోకి తేవాలని అదనపు కలెక్టర్ అన్నారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ బాబు, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం.ఏ. అలీమ్ కార్యదర్శి పి. వీరాంజనేయులు సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ఘనంగా పర్నె సంతోష్ రెడ్డి జన్మదిన వేడుకలు




**చౌటుప్పల్. సెప్టెంబర్ 12. ప్రభాత సూర్య:** చౌటుప్పల్ మండలం, అంకిరెడ్డి గూడెం గ్రామానికి చెందిన పర్నె సంతోష్ రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిజెపి పార్టీకి చెందిన నాయకులు రమణ గోని శంకర్, బత్తుల జంగయ్య గౌడ్, పర్నె శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు బత్తుల మహేష్ గౌడ్, కార్తీక్ రెడ్డి, కళ్యాణ్, పర్నె శేఖర్ రెడ్డి, బాతరాజు లింగస్వామి, బాతరాజు ప్రవీణ్, దొంతర గోని నరసింహ, మిత్రులు శ్రేయోభిలాషులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## స్వర్ణకారుల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



**నల్గొండ సెప్టెంబర్ 12 ప్రభాత సూర్య** నల్గొండ పట్టణంలో హైదరాబాదు రోడ్డులో విశ్వబ్రాహ్మణ సంఘ భవనంలో శుక్రవారం నూతన నల్లగొండ పట్టణ కార్యవర్గ నల్గొండ పట్టణ అధ్యక్షులు చోల్లేటి హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి గోవర్ధన చారి, అనుముల శ్రీధర్ శ్రీరామ్దాస్ విక్రం పసునూరి విక్రమ్ విజయకుమార్ తండోజ్ బ్రహ్మం ప్రమాణ స్వీకారోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో స్వర్ణకారుల జిల్లా అధ్యక్షులు రాచకొండ గిరి తదితరులు పాల్గొన్నారు

## జై భారత్ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయం ప్రారంభం



**నల్గొండ సెప్టెంబర్ 12 ప్రభాత సూర్య** నిరుపేద దివ్యా గులకు, తల్లీ తండ్రి లేని అనాధపిల్లలకు ఆశ్రమాలు ఏర్పాటు చేయడంతో పాటు వారికి విద్యా, వైద్య కోసం సహాయం చేయడం నిరుద్యోగ యువతకు టెక్నీకల్ కోర్స్ లు ఇప్పించి వారికి ఉపాధి కల్పించడం, ఎవరూ లేని నిరుపేద వృద్దులకు సహాయ పడటం కోసం స్థాపించబడిన జై భారత్ చారిటబుల్ ట్రస్ట్ అన్ని విధాలా లక్ష్యం దిశగా పయనించాలని ఆశిస్తున్నట్లు నల్గొండ రెండవ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీ రాఘవ రావు గారు చెప్పారు శుక్రవారం ఉదయం నల్గొండ లో గోలి ప్రభాకర్ స్థాపించిన జై భారత్ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయం వారు ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేవా దృక్పథంతో ముందుకు వెళ్తున్న సంస్థ సభ్యులను అభినందించారు ఈ సందర్భంగా గోలి ప్రభాకర్ మాట్లాడుతూ మా సంస్థ ఇప్పటికే 7 జిల్లాలలో సేవక్ నియామకం జరిగింది అని త్వరలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సర్వే నిర్వహించి అర్హులను గుర్తించి వారికి సేవా కార్యక్రమాలు మొదలు పెడతామని తెలిపారు కార్యక్రమంలో కార్యదర్శి రవి కుమార్, క్రాంతికుమార్ మరియు వివిధ జిల్లాల కో ఆర్డినేటర్ లు సూర్యాపేట జిల్లా చెడుపాక గంగరాజు, యాదాద్రి జిల్లా పోచం కన్నయ్య, మహబూబాబాద్ మేకల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు

## జంట జలాశయాల గేట్ల ఎత్తివేత

**గండిపేట్, : సూర్యా ప్రతినిధి** నగర శివారులో జంట జలాశయాల గేట్లను అధికారులు ఎత్తారు. ఉస్మాన్ సాగర్ ఆరు గేట్లను అధికారులు ఎత్తారు. ఎగువన కురుస్తున్న వర్షాలకు ఉస్మాన్ సాగర్ కు నీటిమట్టం పెరిగింది. ప్రస్తుతం ఉస్మాన్ సాగర్ కి మట్టం 1800 క్యూసెక్కులు ఉన్నట్లు తెలుస్తోంది. ఉస్మాన్ సాగర్ ఎఫ్ టీఎల్ 1790 ఫీట్లు కాగా ప్రస్తుత నీటిమట్టం 1789.40 ఫీట్లు ఉందని అధికారులు తెలిపారు. ఇక హిమాయత్ సాగర్ నాలుగు గేట్లను అధికారులు ఎత్తారు. ప్రస్తుతం హిమాయత్ సాగర్ సాగర్ కి మట్టం 300 క్యూసెక్కులు ఉన్నట్లు తెలుస్తోంది. ఉస్మాన్ సాగర్ ఎఫ్ టీఎల్ 1763.50 ఫీట్లు కాగా ప్రస్తుత నీటిమట్టం 1762.80 ఫీట్లు ఉందని అధికారులు తెలిపారు

# పార్టీ మారిన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ దమ్ముంటే రాజీనామా చేసి గెలవాలి..

- నీతిమాలిన రాజకీయాలకు తెరలేపిన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్..
- ప్రజల కోసం కాదు,స్వార్థం కోసమే..
- ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పై నిప్పులు చెరిగిన రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి

**గండిపేట్ : సూర్య ప్రతినిధి** పార్టీ ఫిరాయింపులకు పాల్పడి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ సిగ్గుమాలిన పని చేస్తున్నారని రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి మండిపడ్డారు.చిల్లర రాజకీయాలకు ప్రకాష్ గౌడ్ పెట్టింది పేరు అని ఎద్దేవా చేశారు.రాష్ట్రంలో రాజకీయాల్లో పార్టీ ఫిరాయింపుల కేసులో ఎమ్మెల్యేల ఫిరాయింపుల విషయంలో స్పీకర్ నిర్ణయం తీసుకోవాల్సిన తరుణంలో స్థానిక ఎమ్మెల్యే చిల్లర రాజకీయాలకు తెరలేపారన్నారు.స్పీకర్ ఎమ్మెల్యేకు నోటీసులు ఇవ్వడంతో ఎమ్మెల్యే సమాధానం విస్తుగొల్పేలా ఉందని అన్నారు.ఈ మేరకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ. .ప్రజలు ఎమ్మెల్యేప్రకాష్‌గౌడ్ చేస్తున్నసిగ్గు మాలిన పనిని గమనిస్తున్నారని మండిపడ్డారు.ఇలాంటి పనికిమాలిన పనికి తెరలేపిన ఎమ్మెల్యేపై శాసనసభాపతి చర్యలు తీసుకోవాలన్నారు.స్పీకర్ కు ఇచ్చిన సమాధానంలో ఎమ్మెల్యే ఇప్పటికీ బీఆర్ఎస్ పార్టీలో కొనసాగుతున్నట్లుగా చెప్పడంఏంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిజంగానే ప్రజలకు మంచి చేసి ఉంటే,ఉప ఎన్నికల్లో పోటీ చేసి మళ్లీ గెలిచి చూపించాలని సవాల్ విసిరారు.పార్టీ మారిన ఎమ్మెల్యే తమ పదవికి రాజీనామా చేసి,దమ్ముంటే ఉప ఎన్నికల్లో పోటీ చేసి తిరిగి గెలవాలని తోకల శ్రీనివాస్ రెడ్డి సవాల్ విసిరారు. ఎమ్మెల్యే ఇప్పటికీ బీఆర్ఎస్ పార్టీలోనే ఉంటే కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో ఎందుకు పాల్గొంటున్నారో చెప్పాలన్నారు.తాను బీఆర్ఎస్ లో ఉన్నా కూడా ముఖ్యమంత్రిని వెళ్లి కలిసిన సమయంలో సీఎం పార్టీ ఖండువా కప్పలేదని,కేవలం జెండాను కప్పారని సిగ్గుమాలిన సమాధానం ఎలా చెబుతారని ప్రశ్నించారు.రాజేంద్రనగర్ ఎమ్మెల్యే పుణ్యాన ప్రజలు తలెత్తుకోలేకపోతున్నారన్నారు. తాను అధికారంలో ఏ పార్టీ ఉంటే అదే పార్టీలోకి మారడం పరిపాటిగా మారిందన్నారు. గతంలో టీడీపీ నుంచి బీఆర్ఎస్ లోకి,బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి మారుతూ తన ఆస్తులను కాపాడుకునే ప్రయత్నంచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.అధికారం కోసమే పార్టీ మారుతున్నట్లు చెప్పాలన్నారు.కాంగ్రెస్ పార్టీలో రాసుకుపూసుకు తిరిగిన ఫోటోలు,వీడియోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయన్నారు.సీఎం రేవంత్ రెడ్డికి క్షీరాభిషేకాలు,ప్రశంసలు ఇలా అన్ని చేస్తున్నావని మండిపడ్డారు.పార్టీ ఖండువా కప్పుకోకపోతే తిరిగి పోటీ చేయి అని సవాల్ విసిరారు.లేదంటే పార్టీ మారినట్లు ఒప్పుకోవాలన్నారు.ఇప్పటికీ నాలుగు సార్లు గెలిచానని చెప్పుకుంటావు,కానీ ఎంఐఎం పుణ్యామా గెలుస్తున్నావని చురకలు అంటించారు. ప్రజలను మోసం చేస్తున్నావని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీతి లేని రాజకీయాలకు పునాది వేస్తున్నావని, రాజకీయాల్లో కొనసాగాలనుకుంటే రాజీనామా చేసిన తర్వాత కాంగ్రెస్ పార్టీ బీఫామ్ తీసుకొని ఇప్పుడు గెలిచి చూపించాలని సవాల్ విసిరారు.సుప్రీంకోర్టు తాజా తీర్పుతో పార్టీ మారిన ఎమ్మెల్యేలకు ఓటమి భయం పట్టుకుందన్నారు. కాంగ్రెస్‌లో చేరినట్లు చెప్పుకోలేని పరిస్థితి దాపరించిందన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, మూల్యం



చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు.

## రాజేంద్రనగర్ బీఆర్ఎస్ అధ్యక్షులు పోరెడ్డి ధర్మారెడ్డి సోదరుని మృతి పార్టీకి తీరని లోటు

నియోజకవర్గ ఇంచార్జ్ పి.కార్తీక్ రెడ్డి



**గండిపేట్, : సూర్య ప్రతినిధి** రాజేంద్రనగర్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పి.ధర్మారెడ్డి సోదరుడు అకాల మరణం పార్టీకి తీరని లోటని నియోజకవర్గ ఇంచార్జ్ పి.కార్తీక్ రెడ్డి అన్నారు. శుక్రవారం ధర్మారెడ్డి గృహానికి వచ్చి కార్తీక్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ.. ధర్మారెడ్డి సోదరుడు మృతి పార్టీలో అందరినీ కలిచి వేసిందన్నారు. నిరంతరం పార్టీ కోసం పని చేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. పరామర్శించిన వారిలో సుభాష్ రెడ్డి, మైలార్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షులు ఎస్.వెంకటేష్, సులేమాన్ నగర్ అధ్యక్షులు జెహరుద్దిన్, రాము యాదవ్, రాజేష్ యాదవ్, పోయిల జీవన్ దాస్, ఎడ్లకాడి సూర్యం, సునీల్, శివ ముదిరాజ్, రావుల జంగయ్య, ముకేశ్, జనార్దన్, వివిధ డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

# నేపాల్‌లో అనూహ్య సంక్షోభం

నేపాల్ చరిత్రలో 239 ఏళ్లపాటు కొనసాగిన రాచరిక పాలన దేశ రాజకీయాలను ఒకే వంశాధిపత్యం కింద కట్టిపడేసింది. ఆ కాలంలో రాజ్యాంగ హక్కులు, ప్రజాస్వామ్య అవకాశాలు లేకపోవడంతో ప్రజల వాణి నిశ్శబ్దంలో నలిగిపోయింది. 2008లో రాజ్యాన్ని అధికారికంగా రద్దు చేసి ప్రజాస్వామ్య గణతంత్రాన్ని ప్రకటించడంతో కొత్త దశ ఆరంభమైనప్పటికీ, గత 27 ఏళ్ల ప్రజాస్వామ్య ప్రయాణం మాత్రం స్థిరత్వాన్ని అందించలేక పోయింది. ప్రధానులు వరుసగా మారిపోవడం, కూటమి ప్రభుత్వాలు కూలిపోవడం, అంతర్గత విభేదాలు పెరగడం ప్రజల్లో తీవ్ర నిరాశను కలిగించాయి. కేవలం రెండు దశాబ్దాల్లోనే 13 కంటే ఎక్కువ ప్రధానులు పదవిలోకి వచ్చి వెళ్లడం రాజకీయ అస్థిరతకు బలమైన సాక్ష్యం. మావోయిస్టు తిరుగుబాట్లు, వర్గపోరాటాలు, సైన్యపు పాత్రపై అనుమానాలు ఈ సంక్షోభాన్ని మరింత పెంచాయి. ప్రజా ఉద్యమాల సమయంలో సైన్యం కీలక పాత్ర పోషించినప్పటికీ, తాజాగా జరిగిన సంఘటనల్లో ప్రభుత్వ భవనాలు, పార్లమెంట్, జైళ్లపై దాడులు జరుగుతున్నా సైన్యం ప్రేక్షకపాత్రలో మిగిలిపోవడం విశ్లేషకుల సందేహాలకు కారణమైంది. కేవలం 34 గంటల వ్యవధిలో ప్రభుత్వం కూలిపోవడం వెనుక బాహ్య శక్తుల పరోక్ష ప్రమేయం ఉందనే అనుమానాలు బలపడుతున్నాయి. గత 27 ఏళ్లలో ప్రభుత్వం 28 సార్లు మారడం ఒక భయానక రాజకీయ అస్థిరతకు ప్రతీక. ప్రజాస్వామ్యం పేరుతో ఏర్పడిన ప్రభుత్వాలు ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోలేకపోవడం వల్ల రాజకీయ వ్యవస్థపై నమ్మకం క్షీణిస్తోంది. ఆర్థిక రంగంలోనూ ఈ అస్థిరత తీవ్ర ప్రతికూలతను మిగిల్చింది. స్థూల ఉత్పత్తి పెరుగుదల నిలకడగా కొనసాగక పోవడం, నిరుద్యోగం పెరగడం, లక్షలాదిమంది యువకులు విదేశాలకు వలస వెళ్ళడం సమస్యలను మరింత తీవ్రతరం చేశాయి. పెట్టుబడులు నిలిచిపోవడం, అభివృద్ధి ప్రాజెక్టులు అర్థాంతరంగా ఆగిపోవడం ప్రజలకు మరో భారం అయ్యింది. అంతే కాకుండా నేపాల్ భూభౌగోళిక పరిస్థితి, భారతదేశం – చైనా వ్యూహాత్మక పోటీలు కూడా ఈ సంక్షోభంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. ఇరు దేశాలు తమకు అనుకూలమైన శక్తులను మద్దతు ఇస్తూ నేపాల్ అంతర్గత రాజకీయాలను ప్రభావితం చేస్తున్నాయని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం సోషల్ మీడియా వేదికలను నియంత్రించే ప్రయత్నం మరింత భగ్గుమన్నది. సెప్టెంబర్ తొలి వారంలో ప్రభుత్వం 26 సోషల్ మీడియా యాప్‌లను నిషేధించగా, ఇప్పటికే అసంతృప్తితో ఉన్న యువత పెద్ద ఎత్తున వీధుల్లోకి వచ్చి నిరసనలు చేపట్టింది. కాఠ్మాండు సహా అనేక ప్రాంతాల్లో ఘర్షణలు చెలరేగాయి. పోలీసులు లాఠీచార్జీలు, టియర్‌గ్యాస్, రబ్బరు బుల్లెట్లు వాడగా నిరసనలు మరింత హింసాత్మక మయ్యాయి. ప్రభుత్వ భవనాలు, జైళ్లపై దాడులు జరిగి, ఖైదీలు తప్పించుకోవడం పరిస్థితిని మరింత కల్లోలంలోకి నెట్టింది. ఈ ఘర్షణల్లో 20 నుండి 30 మంది వరకు ప్రాణాలు కోల్పోగా, 600 నుండి



1000 మందికి పైగా గాయపడ్డారు. వందలాది మంది అరెస్టయి వ్యాపారం, రవాణా, ప్రజా జీవనం పూర్తిగా స్థంభించి పోయింది. ఈ పరిణామాల మధ్య ప్రధానమంత్రి కె.పీ. శర్మ ఓలి రాజీనామా చేయవలసి వచ్చింది. అలాగే చాలామంది ప్రజా ప్రతినిధులు రాజీనామాలు చేయడం, కొందరు నేపాల్ నుంచి క్షణాల్లో తప్పించుకు వెళ్లడం యాదృచ్ఛికంగా కాక, అనివార్యంగా జరిగాయి. మాజీ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ సుశీలా కర్కీని మధ్యంతర ప్రధానిగా నియమించాలని ప్రజలు డిమాండ్ చేశారు. పరిస్థితులు అదుపు తప్పడంతో నేపాల్ ఆర్మీ కీలక భవనాల భద్రతను స్వాధీనం చేసుకుని కాఠ్మాండు వీధుల్లో సైనిక గస్తీలు పెంచింది. ఈ ఉద్యమం కేవలం సోషల్ మీడియా నిషేధానికి వ్యతిరేకంగా మాత్రమే కాక, అవినీతికి వ్యతిరేకంగా వ్యవస్థ మార్పు కోసం జరుగుతున్న పోరాటంగా పరిణమించింది. ముఖ్యంగా యువతలో రాజకీయ నాయకత్వం అవినీతిపర మైందన్న భావన బలపడింది. పారదర్శకత లేకపోవడం, ఎన్నికల ప్రక్రియ లోపభూయిష్టంగా ఉందన్న ఆరోపణలు పెరిగాయి. అందువల్లే ఈ ఉద్యమాన్ని 2006లో జరిగిన "జన ఆందోళన్"తో పోలుస్తున్నారు. ఆ సమయంలో రాజు గ్యానేంద్ర పాలనను ప్రజలు కూలదోయగా, ఇప్పుడు అదే తరం మరోసారి మార్పు కోసం వీధుల్లోకి రావడం చరిత్రాత్మకంగా భావించబడుతోంది. అంతర్జాతీయ వేదికలపై కూడా నేపాల్ పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయి. భారతదేశం ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ శాంతియుత పరిష్కారం కోరింది. చైనా సరిహద్దు భద్రత కోసం నేపాల్‌లో స్థిరత్వం అవసరమని స్పష్టం చేసింది. అమెరికా, యూరోపియన్ యూనియన్ నిరసనకారుల స్వేచ్ఛను గౌరవించాలని, బలప్రయోగం ఆపాలని హెచ్చరించాయి. ఐక్యరాజ్యసమితి అవసరమైతే మానవహక్కుల కమిషన్ ద్వారా విచారణ జరిపేందుకు సిద్ధమని ప్రకటించింది. సార్క్ దేశాలు ఈ సంక్షోభం ప్రాంతీయ శాంతి భద్రతపై ప్రభావం చూపకుండా చర్చలు జరపాలని సూచించాయి. భవిష్యత్తులో నేపాల్ ముందున్న సవాళ్లు విస్తారమైనవే. తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు చేసి పారదర్శక ఎన్నికలు జరపడం అత్యవసరం. నిరసనల్లో జరిగిన ప్రాణనష్టం, పోలీసు దౌర్జన్యాలపై న్యాయపరమైన విచారణ తప్పనిసరి. యువత అభిప్రాయాలను గౌరవిస్తూ వారిని పాలనా ప్రక్రియలో భాగస్వామ్యం చేయడం అవసరం. ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించడం, ప్రజల నమ్మకాన్ని తిరిగి సాధించడం కీలకం. ఈ క్రమంలో పొరుగు దేశాలు, అంతర్జాతీయ సమాజం సహకరించాల్సిన అవసరం ఉంది. ఈ సంక్షోభం నేపాల్‌లో తరాల మార్పుకు సంకేతం. ఇది కేవలం ఒక ప్రభుత్వ పతనం కాదుబీ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసుకోవాలనే, అవినీతిని నిర్మూలించాలనే, యువతకు కొత్త భవిష్యత్తును అందించాలనే సామాజిక ఆకాంక్షను ప్రతిబింబిస్తోంది. సైన్యం తాత్కాలిక భద్రతా బాధ్యతలు చేపట్టినా ప్రజాస్వామ్య వ్యవస్థ పునరుద్ధరణే ఈ ఉద్యమానికి తుదిలక్ష్యం. అంతర్జాతీయ సహకారం, ముఖ్యంగా భారతదేశం మద్దతుతో నేపాల్ మరోసారి స్థిరమైన ప్రజాస్వామ్యాన్ని సాధించాలి.

# విలీనానికి నైజాం ఆక్షేపణ

దేశానికి స్వాతంత్ర్యం వచ్చే నాటికి దేశవ్యాప్తంగా 565 సంస్థానాలు ఉండేవి. బ్రిటీష్ పాలకులు స్వాతంత్ర్యం ఇస్తూనే... సంస్థానాలు ఇండియాలో కలవాలో లేదో నిర్ణయించుకునే అవకాశం సదరు పాలకులకే ఇచ్చారు. ఫలితంగా... మూడు సంస్థానాలు ఇండియాలో కలవలేదు. అవి కాశ్మీర్, జునాఘడ్, హైదరాబాద్ (నైజాం). ఆ పరిస్థితుల్లో ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్... ప్రత్యేక శ్రద్ధ పెట్టి... జునాఘడ్ సంస్థానాన్ని భారత్‌లో కలిసేలా చేశారు. నైజాం నవాబ్ మాత్రం విలీనానికి ఒప్పుకోలేదు. అప్పట్లో రాజాకార్ల పేరుతో ప్రత్యేక సైన్యాన్ని తయారుచేసిన ఖాసిం రజ్వీ... మారణ కాండకు తెగబడ్డారు. స్వాతంత్ర్యం వచ్చాక దాదాపు 13 నెలలపాటూ... తెలంగాణ ప్రజలు చూడని నరకం లేదు. కనీసం తినడానికి తిండి, తాగడానికి నీళ్లు కూడా లేకుండా చేశారు. పొట్టకూటికోసం వర్తక వ్యాపారాలకై వచ్చిన శ్వేత జాతీయులు , రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యంలో సమస్త భారతావనిని అంతర్భాగం చేసుకోగా, ఎన్నో సుదీర్ఘ పోరా టాలు, ఎందరో మహనీయుల త్యాగాల ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం సాధించినా, నిజాం ఏలుబడిలో ఉన్న తెలంగాణ ప్రాంతం స్వతంత్రం కావడానికి సంవత్సరంకు పైగా సమయం పట్టింది. 1724-1948 మధ్యకాలం 224 సంవత్సరాల పాటు 8 తెలంగాణ జిల్లాలు, 5 మరట్వాడా జిల్లాలు, 3 కర్ణాటక జిల్లాలతో కలిపి 16 జిల్లాల హైదరాబాద్ రాష్ట్రం మూడు భాషలతో కొనసాగింది. హైదరాబాద్ సంస్థానాధీశుడు ఏడవ నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్ పరిపాలనా చివరి అంకంలో ఖాసిం రజ్వీ నేతృత్వంలో రజాకార్ల దళాల దురాగతాలు సహించరాని వైనాయి. ఉద్యమ కారులను గురి చేసిన క్రూరాతిక్రూర అమానుష చిత్రహింసలకు హద్దులు లేకుండా పోయాయి. 90 రకాల పన్నుల విధింపే కాకుండా తమ పలుకు బడిలోని ప్రజలను బానిసలుగా చూస్తూ , వెట్టి చాకిరీలు చేయించు కున్నారు . ప్రజల సొమ్ముతో జల్సాలు చేసుకున్నారు. ఎదిరిస్తే కాల్చి చంపారు. మత మార్పిడులు బలవంతంగా చేశారు. తెలుగు వారి సంస్కృతి సంప్రదాయలను అణచివేశారు. స్థానీయ భాషలను, అనాదిగా ఉన్న సంప్రదాయాలను హీనంగా చూశారంటే తెలుగు వారి దుర్గతి స్పష్టమవుతుంది. స్వామి రామానంద తీర్థ నాయకత్వంలో ఆర్యసమాజ్, కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో సాయుధ పోరాటాలు, కవులు, రచయితలు తమతమ పాత్రలు నిర్వహించి, నిజాం పాలనకు వ్యతిరేకంగా ప్రజా చైతన్యానికి కృషి సల్పారు. నల్గొండలో పురుడు పోసుకున్న నిజాం వ్యతిరేక పోరాటం రాజ్యం అంతటా విస్తరించింది. రావి నారాయణ రెడ్డి, చంద్ర రాజేశ్వరరావు , మల్లు స్వరాజ్యం, ఆరుట్ల కమలా దేవి, బొమ్మగాని ధర్మభిక్షం, మాడపాటి హన్మంతరావు , సురవరం ప్రతాపరెడ్డి, కాళోజీ నారాయణరావు, దాశరథి, షోయబుల్లా ఖాన్, అనభేరి ప్రభాకర్ రావు, జమలాపురం కేశవరావు, లక్ష్మీనర్సయ్య, బద్ధం ఎల్లారెడ్డి, మగ్ధూం మొహియుద్దీన్, దొడ్డి కొమురయ్య, కోదాడ నారాయణరావు , బెల్లం నాగయ్య, సింగిరెడ్డి భూపతిరెడ్డి, రాంజీగోండు, కొమురం భీం, రఘునాథరావు కాచే , అలుగు వీరమ్మ, కిషన్ మోదాని, లక్క కిష్టయ్య, బత్తిని మొగిలయ్య, కాటం లక్ష్మీ నారాయణ, మర్రి చెన్నారెడ్డి, వందేమాతరం రాంచందర్ రావు , కర్నె వెంకట కేశవులు ఒక్కరేమిటి... వివిధ పోరాట మార్గాలలో, ఎందరో త్యాగధనులు తమతమ పాత్రలను పోషించి, ప్రాణాలను ఫణంగా పెట్టారు. నారాయణరావు పవార్, శంశా బాద్ గంగారామ్ తో కలిసి ఏకంగా నిజాం పైనే బాంబులు విసిరి సంచలనం సృష్టించారు. దాశరథి కారాగారంలో గోడలపై నిజాం వ్యతిరేక కవితలు రాశారు. కాళోజి, సుద్దాల హనుమంతు, యాదగిరి లక్ష్మీనారాయణ లాంటి వారు జన బాహుళ్య కవితలల్లారు. ఇలా నిజాం వ్యతిరేక పోరాటాలు వివిధ రూపాల్లో ఉధృతం అయిన వేళ . . .రజాకార్ల ఆగడాలు, భారత ప్రభుత్వానికి, నిజాంకు మధ్య జరిగిన అన్ని చర్చలూ విఫలమయ్యాయి. భారత దేశంలో విలీనానికి నిజాం అంగీకరించలేదు. రజాకార్ల ఆగడాలు మితిమీరి పోయాయి. మరోవైపు కమ్యూనిస్టుల సాయుధ పోరాటం సాగుతోంది. హైదరాబాద్ ప్రత్యేక రాష్ట్రంగా నైనా , లేక పాకిస్తాన్లో అంతర్భాగంగా నైనా ఉండాలని నిజాం ప్రయత్నిస్తూ, ఐక్య రాజ్య సమితికి నిజాం, భారతదేశంపై ఫిర్యాదు చేయడానికి దూతలను సైతం పంపాడు. పోరాటానికి దేశాల నుండి ఆయుధ సంపత్తిని పొందే కృషి సల్పారు. 1946 - 1948ల మధ్య హైదరాబాదు రాజ్యంలో నెలకొన్న పరిస్థితులు అత్యంత ఉద్రిక్తమైనవి. హైదరాబాదుకు స్వతంత్ర ప్రతిపత్తి కావాలని ఆశిస్తూ, దాన్ని ప్రత్యేక దేశంగా గుర్తించాలని నిజాం ప్రతిపాదించాడు. ఇత్తెహాదుల్ ముస్లిమీన్ సైనిక విభాగమైన రజాకార్ల కు చెందిన ఖాసిం రజ్వి రంగంలోకి దిగడం దానివల్లనే జరిగింది. వాస్తవ పరిస్థితిని నిజాం రాజుకు అర్థమయ్యేలా చెప్పడానికి కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు ఫలించి, 1947 నవంబర్ 29న యథాతథ స్థితి ఒప్పందం కుదిరింది. 1947 ఆగష్టు 15కు పూర్వపు పరిస్థితికి ఒక సంవత్సరం పాటు కట్టుబడి ఉండాలనేది ఈ ఒప్పంద సారాంశం. నవాబు స్వయంగా ఢిల్లీకి వెళ్లి సర్దార్ పటేల్‌ను కలిసి, 1947 నవంబర్ 29వ యధాతథ ఒప్పందంపై మౌంట్‌బాటన్ నిజాం నవాబు సంతకాలు చేశారు. ఒప్పందంలో భాగంగా హైదరాబాదులో భారత్ తరపున ఏజంట్ జనరల్‌గా కె.ఎం.మున్షీ నియమితుడయ్యాడు.

# విశ్రాంత ఉద్యోగులు సామాజిక సేవలో పాల్గొనాలి

-విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం
-అధ్యక్షునిగా భీమిడి మోహన్ రెడ్డి,ప్రధాన కార్యదర్శిగా కానుగుల వెంకటయ్య
-విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల జిల్లా అధ్యక్షులు కోమటిరెడ్డి మోహన్ రెడ్డి

**చౌటుప్పల్.సెప్టెంబర్ 12. ప్రభాత సూర్య** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం చౌటుప్పల సర్వసభ్య సమావేశం కర్నాటి శంకరయ్య అధ్యక్షతన శుక్రవారం చౌటుప్పల్ పెన్షనర్ల భవనమునందు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కోమటిరెడ్డి మోహన్ రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి ఎన్నికలను నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...విశ్రాంత ఉద్యోగులు సామాజిక సేవ కార్య క్రమములలో పాల్గొనాలని సూచించారు. అనంతరం భీష్మ రెడ్డి, మల్లయ్య, గోపాల్ లు ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. అధ్యక్షునిగా భీమిడి మోహన్ రెడ్డి , ప్రధాన కార్యదర్శిగా కానుగుల వెంకటయ్య, ఆర్థిక కార్యదర్శిగా బడుగు శ్రీరాములు, సహ అధ్యక్షులు గా ఎండి రజాక్, ఉపాధ్యక్షులు ఎన్ కృష్ణయ్య, మహిళా ఉపాధ్యక్షులుగా ఎన్



నాగమణి,సహాయ కార్యదర్శిగా సిహెచ్ వీరయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి గా వి బిక్కు, ప్రచార కార్యదర్శి వి కిషోర్, జిల్లా కౌన్సిలర్ గా కే గీతాంజలి లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. అనంతరం విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల జిల్లా అధ్యక్షులు కోమటిరెడ్డి మోహన్ రెడ్డి ప్రమాణ నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో మోటె సత్తయ్య, సిహెచ్ రాజయ్య, ఏం పాండురంగ చారి, బి ఆగయ్య, బి బుచ్చయ్య, పెన్షనర్లు



పాల్గొన్నారు.

# సీతారాం ఏచూరి ఆశయ సాధన కోసం కృషి చేయాలి

సిపిఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు, కర్నాటి సుధాకర్

**గట్టుప్పల్ ప్రభాతసూర్య 12** భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో ప్రథమ పాత్ర పోషించిన గొప్ప నాయకుడు కామ్రేడ్ సీతారాం ఏచూరి అని సిపిఎం గట్టుప్పల మండల కార్యదర్శివర్గ సభ్యులు కర్నాటి సుధాకర్ శుక్రవారం తెలిపారు. సిపిఎం జాతీయ మాజీ కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా గట్టుప్పల్ మండల కేంద్రంలోని సిపిఎం మండల కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు అర్పించి గౌరవ నివాళులు తెలుపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి కమ్యూనిస్టు కార్యకర్త సీతారాం ఏచూరి ఆశయ సాధన కోసం ముందుకొచ్చి కృషి చేయాల్సిన బాధ్యత ఉన్నట్లు పిలుపునిచ్చారు. దక్షిణాది రాష్ట్రాల్లో కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి సీతారాం ఏచూరి అహర్నిశలు కృషి చేసిన నాయకుడని, ప్రత్యేకంగా ఢిల్లీ యూనివర్సిటీలో ఎస్ఎఫ్ఐ ఉద్యమంలో గొప్ప నాయకుడిగా ఆల్ ఇండియా కార్యదర్శిగా సేవలు అందించిన వ్యక్తి అని వివరించారు. విద్యార్థి దశ నుంచి ప్రజల పీడనాన్ని అరికట్టడం, శ్రామిక వర్గాల సంక్షేమం కోసం నిరంతరం పోరాటాలు చేసిన అద్భుత వ్యక్తి అని పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్టులను ఏకీకృతంగా ముందుకు నడిపించేందుకు తమ పరాక్రమం చాటుకున్న మహనీయుడిగా సీతారాం ఏచూరి గుర్తించదగిన వ్యక్తి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు టేకుమట్ల కృష్ణ, కర్నాటి వెంకటేశం, పెద్దగాని నరసింహం, రైతు సంఘం మండల అధ్యక్షుడు ముసుకు బుచ్చిరెడ్డి, సిపిఎం సీనియర్ నాయకులు ఎండి రబ్బాని, కర్నాటి యాదయ్య, పసుపుల చెన్నయ్య, బొబ్బల చంద్రయ్య, ఖమ్మం నరసింహ, మస్నం మల్లయ్య తదితరులు పాల్గొని



స్మరణార్థ పూలమాలలు అర్పించారు.

# శ్రీ శ్రీ లలితా త్రిపుర సుందరి ఆలయ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక

**పెబ్బేరు. సెప్టెంబర్ 12 ప్రభాత సూర్య** శ్రీశ్రీశ్రీ లలితా త్రిపుర సుందరి దేవి అమ్మవారి ఆలయంలో ప్రాణప్రతిష్ట అనంతరం దేవి నవరాత్రుల ఉత్సవ కమిటీనిబిశ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో నిత్యం అమ్మవారి సేవలో పాల్గొనేందుకు . దేవీ నవరాత్రుల సందర్భంగా 11 రోజులపాటు అమ్మవారికి వివిధ రూపఅలంకరణతో పాటు, చండీ హెూమం, అన్నప్రసాద వితరణతో పాటు అమ్మవారి నవరాత్రి ఉత్సవాల్లో ఘనంగా నిర్వహించుటకు ఆలయ నూతన కమిటీ సభ్యులును గౌరవ అధ్యక్షులు వడ్డే ఈశ్వర్, ఎస్ కిషోర్, కర్నాటి శ్రీనివాస్ గౌడ్. ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్య సలహాదారులు తిమ్మాపూర్ నారాయణబీ పున్న శ్రీనివాసులుబీ కారెడ్డి.హనుమంత్ రెడ్డి, వీరభోజ చారి, మేకల. ఎల్లయ్య, మేకల.సహదేవుడు. శ్రీ శ్రీ లలిత త్రిపుర సుందరి దేవి ఆలయ కమిటీ అధ్యక్షులు అల్వాల ప్రదీప్ గౌడ్, అమ్మవారి అలంకరణ సేవకైబి- బత్తుల.అనిల్ కుమార్, మణిముఖేష్, సాయి శంకర్, స్వామి(సాయి మణి). ప్రధాన కార్యదర్శులు గొడుగు బాలవర్ధన్, బి.కళ్యాణ్, జి.బాలగౌడ్, బి.అరవింద్, కె.వినోద్,నవీన్. వర్కింగ్ కమిటీ కన్వీనర్లు గుర్రం.రాజు, గొడుగు శాంతన్న, బుజ్జి, చిన్న వెంకట్, సూర్యవంశం. పరుశరాముడు, ప్రేమ్ కుమార్, అల్వాల సాయి తేజ. అన్న ప్రసాద వితరణ కమిటీసభ్యులుగా



యస్. మధు, మునీశ్వర్ నాయుడు, రమేష్ గౌడ్, మిర్చి. వెంకటేష్, శ్రీరాములు, నారాయణ (ఎలక్ట్రికల్), దయానంద్, చిన్న రాములు. కోశాధికారులు గుర్రంగడ్డ బాలరాజ్, టీచర్ మల్లికార్జున్ రెడ్డి బాలవర్ధన్‌బీ సంస్కృతిక విభాగం కన్వీనర్స్ మేకల.నాగరాజుబీ బసాల. వెంకటేశ్వర్ రెడ్డి,టీచర్ మోహన్, డప్పు.రాజశేఖర్, తొండ రమేష్, మోహన్ . సంయుక్త కార్యదర్శిగా భాస్కర్, సాయి,బన్ని,శివ,కురుమూర్తి, అఖిల్ లను 11 రోజులపాటు జరగనున్న. దేవీ నవరాత్రుల ఉత్సవ కమిటీని ఏకగ్రీవంగా ఆలయ ప్రధాన కార్యదర్శి వడ్డే.ఈశ్వర్, కమిటీ సభ్యులను ఎన్నిక చేశారు. అమ్మవారికి సేవలో పాల్గొనేవారు, ఆలయ కమిటీ సభ్యులను సంప్రదించాలని ఆయన తెలిపారు దేవీ నవరాత్రుల ఉత్సవాలలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు

# జగద్గిరినగర్ ఉన్నత పాఠశాలకు దక్కిన అరుదైన గౌరవం

మండల ఉత్తమ ఉపాధ్యాయ
అవార్డుకు ఎంపికైన ఉపాధ్యాయినులు..

**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 12 (ప్రభాత సూర్య):** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం, జగద్గిరిగుట్ట డివిజన్, జగద్గిరినగర్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు తెలుగు ఉపాధ్యాయినీలు కుత్బుల్లాపూర్ మండల ఉత్తమ ఉపాధ్యాయినిలుగా ఎంపికయ్యారు.డాక్టర్.సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా స్థానిక శాసన సభ్యులు కె.పి.వివేకానంద్ సౌజన్యంతో మండల స్థాయిలో ఇవ్వబడుతున్న ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులు బహదూర్ పల్లి లోని మేకల వెంకటేశం ఫంక్షన్ హాల్లో జరిగింది.ఈ మేరకు జగద్గిరినగర్ ఉన్నత పాఠశాల లో (స్కూల్ అసిస్టెంట్ ) తెలుగు ఉపాధ్యాయినులు 20 సంవత్సరాల సుదీర్ఘ అనుభవంతో ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దినందుకుగాను వారి విశేష సేవలను గుర్తించి అవార్డులకు ఎంపిక చేశారు. విద్యార్థుల అభిమానాన్ని చురగొన్నటువంటి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయినిలు యం.సి. జ్యోతి, నీలకంఠం శైలజ రాణి,ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని పి.శ్రీదేవి లను ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ చేతుల మీదుగా అవార్డుతో సత్కరిస్తూ శాలువాతో సన్మానించారు.ఈ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయినిలు మాట్లాడుతూ పాఠశాలనే దేవాలయంగా



భావిస్తూ తమ విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తూ వారి ఉజ్వల భవితకు పునాదులు వేస్తున్నందుకు తమకు దక్కిన అరుదైన గౌరవమని సంతోషం వ్యక్తం చేశారు. ఇది జీవితంలో మరిచిపోలేని గొప్ప అనుభూతి అని అన్నారు.ఈ కార్యక్రమంలో పలు ఉపాధ్యాయ సంఘాలు నాయకులు మూడు మండలాలు విద్యాధికారులు, కుత్బుల్లాపూర్ మండలం విద్యాధికారిణి జెమినీ కుమారి తోపాటు జగద్గిరినగర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుభాష్ చంద్రబోస్ రెడ్డి, ఉపాధ్యాయులు సుధాకర్, సుభాష్, త్రివేణి, శ్రీదేవి రామారావు, రామకృష్ణ రాజు, గౌరీశంకర్, కిష్టయ్య, ఉష శ్రీ, జయ రాథోడ్ లు పాల్గొని అవార్డు గ్రహీతలకు అభినందనలు తెలిపారు.

## ఫోటో ట్రేడ్ ఎక్స్పో పోస్టర్ ఆవిష్కరణ

**సంస్థాన్ నారాయణపురం, సెప్టెంబర్ 12( ప్రభాత సూర్య ):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో ఫోటో ట్రేడ్ ఎక్స్పో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఫొటో గ్రాఫర్స్ మండల అధ్యక్షుడు ఓరుగంటి లింగస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యాదాద్రి భువనగిరి జిల్లా అసోసియేషన్ ఉపాధ్యక్షులు పాలకూర్ల యాదయ్య విచ్చేసి పోస్టర్ ఆవిష్కరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గంగాపురం సాయి గౌడ్, ప్రధాన కార్యదర్శి చిలువేరు శేఖర్, కొండ శ్రీకాంత్, నీళ్ల రాజు, నీళ్ల శివ, మొగుదాల ప్రదీప్,మందుగుల సాయికిరణ్,బొంగు మధు, వీరమల్ల శ్రావణ్ తదితులు పాల్గొన్నారు




## ధర్మోజిగూడెంలో ఉచిత వైద్య శిబిరం

**చౌటుప్పల్. సెప్టెంబర్ 12.ప్రభాత సూర్య:** చౌటుప్పల్ మండలం ధర్మోజిగూడెం గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో కామినేని హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యువజన కాంగ్రెస్ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు జువ్వి నరసింహ హాజరై మాట్లాడుతూ..గ్రామస్తులు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య శిబిరంలో భాగంగా బీపీ, షుగర్ లతో పాటు పలురకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ముఖ్యంగా వృద్ధులు మోకాళ్ళ నొప్పులు, కీళ్ల నొప్పులకు వైద్యం చేయించుకున్నారు. ఉచితంగా మందులు పంపిణీ చేసిన కామినేని వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి, కామినేని హాస్పిటల్ సూపర్ వైజర్ బాలకృష్ణ, వైద్య బృందం, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## వ్యవసాయ మార్కెట్ కమిటీ కమర్షియల్ షాపులు బహిరంగ వేలం పాట




**చౌటుప్పల్.సెప్టెంబర్ 12. ప్రభాత సూర్య:** చౌటుప్పల్ పురపాలక కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ చౌటుప్పల్ మార్కెట్ యార్డ్ ముందు భాగం నందు గల కమర్షియల్ షాపులను బహిరంగ వేలం పాట శుక్రవారం నిర్వహించారు. కర్నాటి నరేష్, వంగూరి పార్వతమ్మ, దేశట్ల శ్రీనివాస్, బానోతు రవికుమార్, కాసోజు శ్రీకాంత్, కాసోజు గోవర్ధన్ లు పాల్గొని వేలంపాటలో షాపులను పొందడం జరిగిందని జిల్లా మార్కెటింగ్ అధికారి ఏ సబిత తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి,గౌరవ సభ్యులు గౌస్ ఖాన్, బోయ వెంకటేష్, మార్కెట్ కమిటీ కార్యదర్శి రవీందర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## సీతారాం ఏచూరి ఆశయాలను సాధిస్తాం

: గోశిక కరుణాకర్




**చౌటుప్పల్.సెప్టెంబర్ 12. ప్రభాత సూర్య:** స్వర్గీయ సీతారం ఏచూరి ఆశయాలను సాధిస్తామని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు గోషిక కరుణాకర్ అన్నారు. సిపిఎం పార్టీ చౌటుప్పల మున్సిపల్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సిపిఎం పార్టీ మాజీ జాతీయ కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గోశిక కరుణాకర్ మాట్లాడుతూ... సీతారాం ఏచూరి విద్యార్థి దశ నుండి విద్యార్థుల సమస్యల పరిష్కారం కొరకు అనేక పోరాటాలు చేసి సాధించిన గొప్ప వ్యక్తిని అన్నారు.ఆనాడు ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ ఎదిరించి నిలబడిన ధైర్యశాలి అన్నారు. విద్యార్థి ఉద్యమం నాయకుడి నుండి సిపిఎం పార్టీ జాతీయ కార్యదర్శి వరకు ఎదిగి ఒదిగిన తెలుగు తేజమని అన్నారు. అనంతరం ఎండి పాషా మాట్లాడుతూ... రాజ్యసభలో సైతం ప్రజా వ్యతిరేక చట్టాలను సవరించిన ఉత్తమ పార్లమెంట్ అవార్డు గ్రహీత అని కొనియాడారు. కమ్యూనిస్టుగా పుట్టి, కమ్యూనిస్టుగా మరణించడం అంటే మహాత్ముడితో సమానమని అన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గొరిగే సోములు, బండారు నరసింహ,బత్తుల దాసు, ఆదిమూలం నందీశ్వర్, ఉష్కాగుల శ్రీను, ఆకుల ధర్మయ్య, ఈదయ, ధర్మారెడ్డి, మల్లేష్, ఐలయ్య, స్వామి, బొడ్డు అంజిరెడ్డి, చింతకింది పాండు, సప్పిడి శ్రీనివాసరెడ్డి, శివ, రాములు, యాదయ్య, మదర్, శ్రీనివాస్ రెడ్డి, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన

కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పల లింగస్వామి

**సంస్థాన్ నారాయణపురం, సెప్టెంబర్ 12( ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన ఉప్పరగొని నర్సమ్మ భర్త ఎల్లయ్య గురువారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందింది. వారి మరణ వార్త తెలుసుకొని మృతురాలు కుటుంబసభ్యునికి 5000 రూపాయల ఆర్థిక సహాయం అందజేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పల లింగస్వామి. ఈ ఆర్థిక సహాయం కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మందుగుల బాలకృష్ణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రత్తిపెల్లి యాదయ్య చేతుల మీదుగా వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డ్ మెంబర్ ఉప్పరగొని యాదయ్య, క్రైమ్ మిర్రర్ రిపోర్టర్ ఉప్పల వెంకటేష్, యువజన కాంగ్రెస్ మండల కార్యదర్శి ఉప్పల నాగరాజు, లింగంపల్లి జంగయ్య, చింతల రాములు,గట్టు గోపాల్, ఉప్పరగొని అంజయ్య, అర్జున్ స్వామి తదితరులు పాల్గొన్నారు.



# ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయులను సత్కరించడం అదృష్టంగా భావిస్తున్నా

కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, టిఆర్ఎస్ ఎల్పీ విప్ కేపీ వివేకానంద్

**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 12 (ప్రబత సూర్య)** బడ్జెట్ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారిని సత్కరించే అవకాశం తనకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నానని కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు, టిఆర్ఎస్ ఎల్ పి విప్ కీపి వివేకానంద అన్నారు. తెలంగాణ గుర్తింపు పొందిన అఫర్డబుల్ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం (ట్రాపసా) ఆధ్వర్యంలో సూరారం లోని విఐపి ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలకు ఆయన పాఠశాలలకు చెందిన 120 మంది ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మధ్యతరగతి ప్రజలు అత్యధికంగా నివసించే కుత్బుల్లాపూర్ లో బడ్జెట్ పాఠశాలల పాత్ర అత్యంత కీలకంగా ఉందన్నారు. ఇలాంటి పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్న వారు ఎంతో అంకితభావంతో పనిచేస్తున్నారని కొనియాడారు. బడ్జెట్ పాఠశాలల వల్ల సామాన్యులకు కూడా అత్యున్నత విద్య అందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బడ్జెట్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను సత్కరించాలనే ఆలోచన గొప్ప విషయం అన్నారు. ఉపాధ్యాయులు మరింత అంకుఠ దీక్షతో పనిచేసేందుకు దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమం నిర్వహించిన ట్రాపసా సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, దుండిగల్ ఎం ఈ ఓ కిషన్, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు ఎస్ ఎన్ రెడ్డి, అసోసియేట్ అధ్యక్షులు రామేశ్వర్ రెడ్డి, కోశాధికారి శ్రీకాంత్ రెడ్డి, ట్రస్మా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్ రెడ్డి, ఆంజనేయులు, కోశాధికారి గిరిబాబు, ట్రాపసా చైర్మన్ కోలా వెంకటేష్, కుత్బుల్లాపూర్ అధ్యక్షులు వినోద్ జాదవ్, ప్రధాన కార్యదర్శి దయాకర్, కోశాధికారి శ్రీశైలం, సీనియర్ కరస్పాండెంట్లు నరసింహులు గౌడ్, భూపాల్ రెడ్డి, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.





# పాపిరెడ్డి నగర్, ఆస్బెస్టాస్ కాలనీ మధ్య గల పార్కును పది రోజుల్లో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం

పీఏసీ చైర్మన్, శేర్లింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 12 (ప్రభాత సూర్య) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం, కూకట్ పల్లి డివిజన్ లో పలు అభివృద్ధి కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం శాసన సభ్యులు, పీఏసీ చైర్మన్ అరికేపూడి గాంధీ తో కూకట్ పల్లి డివిజన్ సీనియర్ నాయకులు చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి పాపిరెడ్డి నగర్, ఆస్బెస్టాస్ కాలనీ మధ్య గల పార్కును ఎమ్మెల్యే అరెకేపూడి గాంధీ ని, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ ని త్వరితగతిన ప్రారంభం చేసే విధంగా చూడాలని, లేని పక్షంలో అక్కడ రోజు రోజుకు అసాంఘిక శక్తులు మితిమీరిపోతున్నారని కోరారు. అదే విధంగా ఆ పార్కులో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యం మరింత మెరుగు పరిచే విధంగా సహాయ సహకారాలు అందించగలరని కోరారు. దానికి స్పందించిన ఎమ్మెల్యే, కార్పొరేటర్ వెంటనే అధికారి ఈ ఈ గోవర్ధన్ ని వారం పది రోజుల్లో పార్కును ప్రారంభించేలా ఏర్పాట్లు చేయాలని, ఓపెన్ జిమ్ కు సంబంధించిన ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేసేలా ఏర్పాటు చేయాలని అధికారికి ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో డివిజన్ సీనియర్ నాయకులు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# సోషల్ మీడియా తప్పుడు వార్తలు నమ్మకండి

-అసత్య కథనాలు రాసిన వారిపై చట్టపరమైన చర్యలు

-విలేకరుల సమావేశంలో సాయిరాం హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ జంగాల సునీల్ కుమార్

**ఖమ్మం/అక్షిత బ్యూరో :**ఠాగూర్ సీన్ రిపీట్ మృతదేహానికి చికిత్స అంటూ సోషల్ మీడియాలో వచ్చిన తప్పుడు వార్తలను నమ్మవద్దని అటువంటి తప్పుడు వార్తలు రాసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్టు ఖమ్మంలోని సాయిరాం ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ జంగాల సునీల్ కుమార్ అన్నారు. ఐఎంఏ నాయకులతో కలిసి ఖమ్మం ప్రెస్ క్లబ్ లో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ జంగాల సునీల్ కుమార్ మాట్లాడుతూ సాయిరాం హాస్పిటల్ పై కొందరు వ్యక్తులు సోషల్ మీడియాలో తప్పుడు వార్తలను ప్రచురించి ప్రజల్లో అభద్రతాభావాన్ని కలిగించే విధంగా చేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని అన్నారు. 13 సంవత్సరాల బాలుడు కామెర్లు తీవ్రమైన లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతూ నాటు వైద్యం తీసుకుంటూనే హైదరాబాద్ స్థాయిలో అనేక ఆసుపత్రులు చుట్టూ తిప్పారని కొన్ని రోజులపాటు ఓ దేవాలయంలో ఉంచారని పేషంట్ కండిషన్ తీవ్రతరం కావడంతో తమ ఆసుపత్రికి తీసుకొచ్చారని తెలిపారు. ఆ సమయంలో ఐసీయూలో ఉన్న పేషెంట్ బ్రతికే ఉండి కాళ్ళు చేతులు ఆడించటం పేషంటు బంధువులు చూశారని తెలిపారు. దానికి సంబంధించిన వీడియోలు కూడా బంధువులకు చూపించామని రోగి తీవ్రవిషమ పరిస్థితిలో ఉండడంతో మెరుగైన వైద్యం కోసం వేరే ఆసుపత్రికి తీసుకు వెళ్ళమని రిఫర్ చేశామని తెలిపారు. పేషెంట్ ను తీసుకు వెళుతున్న క్రమంలో మార్గమధ్యమంలో చనిపోయాడని తెలిపారు. తమ ఆసుపత్రి పై తప్పుడు ప్రచారం చేసేందుకు "ఠాగూర్ సినిమా రిపీట్ – మృతదేహానికి చికిత్స" అంటూ సోషల్ మీడియా గా అసత్య ప్రచారం చేశారని తప్పుడు వార్తలు రాశారని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పుడు వార్తలు రాసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఐఎంఏ నాయకులు డాక్టర్ కంభంపాటి నారాయణరావు డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్ లు మాట్లాడుతూ డాక్టర్లు తమ వృత్తి ధర్మంలో భాగంగా పేషంటును బతికించడానికి ప్రయత్నం చేస్తారే తప్ప ప్రాణాలు తీయడానికి కాదని అన్నారు. పేషంటు పరిస్థితి ఆందోళనకరంగా ఉందని బాధితులకు ముందే చెప్పడం జరిగిందని జరిగిన పరిణామంపై డాక్టర్లను దోషులుగా చిత్రీకరించాలనుకోవడం మంచి పద్ధతి కాదన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా వివరణ తీసుకోకుండా ఆసుపత్రులు డాక్టర్లపై తప్పుడు వార్తలు రాసి బదనాం చేయాలనుకోవడం అవివేకం అని అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో డాక్టర్ బొల్లికొండ శ్రీనివాసరావు డాక్టర్ జంగాల స్వాతి డాక్టర్ విజస్ వర్మ డాక్టర్ సుజేంద్ర రెడ్డి డాక్టర్ ప్రియాంక డాక్టర్ రవికుమార్ డాక్టర్ శ్రీకాంత్ డాక్టర్ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.




# భారతదేశంలో జోయాలుక్కాస్ 107వ అతిపెద్ద షోరూం

ప్రపంచ స్థాయి ఆభరణాలతో కూకట్ పల్లి లో జోయాలుక్కాస్ నూతన షోరూం ప్రారంభం

జోయాలుక్కాస్ లో వినియోగదారులకు జువెలరీ, డైమండ్స్ అతి తక్కువ ధరలో అందిస్తుంది

పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ



**కూకట్ పల్లి, సెప్టెంబర్ 12 (ప్రభాత సూర్య)** :అతి తక్కువ ధరలో వినియోగదారులకు ప్రపంచ స్థాయి ఆభరణాలతో జోయాలుక్కాస్ అందిస్తుందని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ అన్నారు. శుక్రవారం కూకట్ పల్లి లో జోయాలుక్కాస్ నూతన రెండవ షో రూమ్ అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఈ ప్రారంభోత్సవానికి జోయాలుక్కాస్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ జాయ్ అలుక్కాస్ ఆహ్వానం మేరకు పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, వివేకానంద నగర్ డివిజన్ కార్పొరేటర్ రోజా దేవి రంగారావు, ప్రముఖులు, సెలబ్రిటీలు, జోయాలుక్కాస్ గ్రూప్ సీనియర్ అధికారులు ముఖ్య అతిథులుగా హాజరై జోయాలుక్కాస్ నూతన షోరూమ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరికపూడి గాంధీ మాట్లాడుతూ కూకట్ పల్లి లో జోయాలుక్కాస్ తమ రెండవ సరికొత్త షోరూంను ప్రారంభించడం ద్వారా మరొక మైలురాయిని చేరుకుందని అన్నారు. వినియోగదారుల ప్రతి కొనుగోలుపై ఒక ఉచిత బహుమతి లభిస్తుందని అన్నారు. ఈసారి కొత్త షోరూం అంతర్జాతీయ ప్రమాణాల ఇంటీరియర్ డిజైన్ చేయబడిందని అన్నారు. కస్టమర్ ఫస్ట్ విధానంతో ఆభరణాల రిటైల్ రంగంలో ఒక కొత్త ప్రమాణాన్ని నెలకొల్పిందని, వినియోగదారుల అభివృద్ధికి తగినట్లుగా రూపొందించబడిన సాంప్రదాయ సమకాలిన డిజైన్ ల వరకు ఎలిగంజా పోల్కి డైమండ్స్, యువ ఎవిరిడే జువెలరీ, అపూర్వ యాంటీ కలెక్షన్, రత్న ప్రిషియస్ స్టోన్, జువెలరీ, బంగారం, వజ్రాలతో సరికొత్త డిజైన్లు కూడా ఉన్నాయని, ఇవి వినియోగదారులను మంత్రముగ్ధులను చేస్తాయని అన్నారు. అనంతరం జోయాలుక్కాస్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ జాయ్ అలుక్కాస్ మాట్లాడుతూ కూకట్ పల్లి లో మా రెండవ షో రూమ్ ను ప్రారంభించడం ఆనందంగా ఉందని అన్నారు. అతి తక్కువ ధరలలో వినియోగదారులకు అందించి వారిని తృప్తి పరచడం గర్వంగా ఉందని అన్నారు. ప్రతి కొత్త ప్రారంభోత్సవం ప్రపంచం జోయాలుక్కాస్ వైపు దృష్టి సారిస్తుంది అని అన్నారు. జోయాలుక్కాస్ లో అసమానమైన శోభను తిలకించడానికి ప్రతి ఒక్కరూ మా షోరూంను సందర్శించాలని కోరారు.

## బూర నర్సయ్య గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిసిన బీజేపీ నాయకులు



**చౌటుప్పల్.సెప్టెంబర్ 12. ప్రభాత సూర్య:** తెలంగాణ రాష్ట్ర బీజేపీ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నికైనటువంటి మాజీ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ ను,డాక్టర్ కాసు వెంకటేశం ను శుక్రవారం చౌటుప్పల్ మండల బీజేపీ పార్టీ అధ్యక్షులు కైరం కొండ అశోక్ ఆధ్వర్యంలో స్థానిక బిజెపి నాయకులు వారిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల మండల అధ్యక్షులు కైరం కొండ అశోక్, జిల్లా ఉపాధ్యక్షులు శాగ చంద్రశేఖర్ రెడ్డి, మాజీ సర్పంచులు కాయితి రమేష్ గౌడ్, గడ్డం నరసింహ , మునగాల తిరుపతిరెడ్డి, పాలకూరల్ల జంగయ్య గౌడ్, ఉడుగు యాదయ్య గౌడ్, కంచర్ల గోవర్ధన్ రెడ్డి,చినుకానీ మల్లేష్ యాదవ్,దుర్గ కృష్ణ,కట్ట కృష్ణ,పోట్టబతిని బాలరత్నం, నూనె సహదేవ్, పబ్బతి శేఖర్ గౌడ్, ఎన్నంపల్లి శ్రీకాంత్ రెడ్డి,బత్తుల కృష్ణ, మునుకుంట్ల వెంకటేశం గౌడ్, కొయ్యడి స్వామి గౌడ్, ఊర సృజన్, అల్మాస్పేట గౌతమ్, బొంగు వెంకటేశం గౌడ్, వెంకటరమణ గౌడ్,చౌట రవీందర్ గౌడ్,బాతరాజు సాయి తదితరులు పాల్గొన్నారు.

## మర్రిగూడ లో ఘనంగా ఏచూరి సీతారాం వర్ధంతి



**మర్రిగూడ సెప్టెంబర్ 12(ప్రభాత సూర్య)** మర్రిగూడ మండల కేంద్రంలో సిపిఎం ఆధ్వర్యంలో కామ్రేడ్ సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి నిర్వహించారు, ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు సిఐటియు మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య మాట్లాడుతూ, పేద ప్రజల అభ్యున్నతి కోసం ఏచూరి సేవలు మరువలేనివి అని , ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సిపిఎం నాయకులు సెలవు రామలింగాచారితో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు


## సమాజాన్ని చైతన్య పరచడంలో జర్నలిస్టుల పాత్ర కీలకం

డీసీసీబీ ఛైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య



**తుర్కయంజాల్, సెప్టెంబర్ 12, ప్రభాత సూర్య:** సమాజాన్ని చైతన్య పరచడంలో జర్నలిస్టుల పాత్ర కీలకం అని తెలంగాణ కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ లిమిటెడ్ వైస్ ఛైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. ఈ నెల 26వ తేదీన మహేశ్వరం నియోజకవర్గంలోని కందుకూరులోని శుభం గార్డెన్స్లో నిర్వహించతలపెట్టిన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా 3వ మహాసభల కరపత్రాని ఆయన శుక్రవారం తుర్కయంజాల్లో అవిష్కరించారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అధ్యక్షులు సిలివేరు యాదగిరి, కార్యదర్శి పల్లాటి జగన్, సీనియర్ జర్నలిస్టులు బోడ మణి కుమార్, వెంకటేష్, క్రాంతి, అంజి, కుమార్, రవి, శ్రీను, వెంకటేష్ గౌడ్, కుమార్, లింగం, ఉపేందర్, కృష్ణ, మల్లేష్, తదితరులు పాల్గోన్నారు.

## పంతంగిలో డోర్ టు డోర్ ఓటర్ ఐడెంటిఫికేషన్



**చౌటుప్పల్. సెప్టెంబర్ 12. ప్రభాత సూర్య :** నల్గొండ జిల్లా యువకాంగ్రెస్ ఆధ్వర్యంలో చౌటుప్పల్ మండలం, పంతంగి గ్రామం బూత్ నం.18, 19, 20, 21లో డోర్ టు డోర్ ఓటర్ ఐడెంటిఫికేషన్ కార్యక్రమంను చౌటుప్పల్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ భార్గవ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శిస్తూ ఓటర్ల జాబితా పరిశీలన, లోపాల గుర్తింపు, ప్రజల్లో అవగాహన కల్పించడం ప్రధాన లక్ష్యంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మేకల ప్రమోద్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. ఓటు హక్కు ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రధాన ఆయుధం అని, ప్రజలు నిర్లక్ష్యం చేస్తే అవినీతి శక్తులు ప్రజాస్వామ్యాన్ని కబళిస్తాయని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మునుగోడు నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అబ్బనబోయిన రామకృష్ణ యాదవ్, నల్లగొండ జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జాల మణికంఠ, పంతంగి యువజన కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు బోయ సంపత్, యువకాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# హార్రర్ ప్రాంచైజీ కాంచన 4 వచ్చేస్తుంది..
# రాఘవా లారెన్స్ టీం క్రేజీ న్యూస్..!




కోలీవుడ్ నుంచి వచ్చి తెలుగులో కూడా సూపర్ క్రేజ్ సంపాదించుకున్న హార్రర్ ప్రాంచైజీల్లో టాప్‌లో ఉంటుంది కాంచన. రాఘవా లారెన్స్ స్వీయ దర్శకత్వంలో లీడ్ రోల్స్‌లో నటించిన ఈ ప్రాంచైజీ బాక్సాఫీస్ వద్ద నిర్మాతలకు కాసుల వర్షం కురిపించింది. కాగా తెలుగు, తమిళ ప్రేక్షకులకు ఓ వైపు వినోదం అందిస్తూనే.. మరోవైపు గూస్ బంప్స్ తెప్పించేందుకు కాంచన 4 కూడా వచ్చేస్తుంది. కోలీవుడ్ సర్కిల్ కథనం ప్రకారం కాంచన 4 చిత్రీకరణ సగభాగం పూర్తయింది. రాఘవా లారెన్స్ టీం వీలైనంత త్వరగా కాంచన 4 ప్రొడక్షన్ పనులు పూర్తి చేయాలని ప్లాన్ చేస్తున్నట్టు సమాచారం. ఈ చిత్రానికి రాఘవా లారెన్స్ డైరెక్టర్ కమ్ ప్రొడ్యూసర్‌గా కూడా వ్యవహరిస్తున్నాడు. కాంచన 4లో బాలీవుడ్ భామ నోరా ఫతేహి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ మూవీతో కోలీవుడ్ ఎంట్రీ ఇస్తోంది నోరా ఫతేహి. పూజా హెగ్డే, రష్మిక మందన్నా కూడా కాంచన 4లో టీంతో జాయిన్ కాబోతున్నట్టు వార్తలు వస్తుండగా.. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. కాగా కాంచన 3 మిక్స్ రివ్యూస్ వచ్చినప్పటికీ బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్ టాక్ తెచ్చుకుంది. కాంచన 3 తెలుగులో నాని నటించిన జెర్సీ చిత్రానికి బాక్సాఫీస్ వదదగట్టి పోటీనివ్వడమే కాదు సుమారు 100 కోట్ల వరకు వసూల్లు రాబట్టింది. మరి కాంచన 4 ఎలాంటి రెస్పాన్స్ తెచ్చుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది.

# జాతకం మార్చేసిన 200 కోట్ల సినిమా



ఇండస్ట్రీలో అంతే. ఒకే ఒక్క సినిమా రాత్రికి రాత్రి జాతకాలను మార్చేస్తుంది. చిరంజీవికి ఖైదీ, నాగార్జునకు శివ అలా నిలిచిపోయినవే. కాకపోతే హీరోయిన్లకు ఇలాంటి బ్రేక్స్ దొరకడం కష్టం. విజయశాంతికి కర్తవ్యం లాగా ప్రతి ఒక్కరికి అవి సాధ్యం కావు. కానీ కళ్యాణి ప్రియదర్శన్ సుడి బాగుంది. ఇటీవలే విడుదలైన కొత్త లోక చాప్టర్ 1తో ఏకంగా 200 కోట్ల క్లబ్బులో అడుగు పెట్టడంతో తన స్టార్ డమ్ అమాంతం పెరిగిపోయింది. లోకకు సంబంధించి లీడ్ రోల్ తనదే కావడంతో హీరో నస్లీన్ ఎక్కువసేపు కనిపించినా కూడా ఆమె స్థాయిలో గుర్తింపు దక్కించుకోలేకపోయాడు. అలా కళ్యాణికి దశ తిరుగుతోందన్న మాట.

తొమ్మిది సంవత్సరాల క్రితం వచ్చిన కళ్యాణి ప్రియదర్శన్ సరైన బ్రేక్ కోసం చాలానే ఎదురు చూసింది. తెలుగులో డెబ్యూ చేసిన హలో పోయినా చిత్రలహరి మంచి హిట్ గానే నిలిచింది. కానీ రణరంగం డిజాస్టర్ కావడంతో మళ్ళీ ఈ వైపుకు రాలేదు. మలయాళం, తమిళం మీదనే ఎక్కువ ఫోకస్ పెట్టింది. ఇప్పటిదాకా ఈ అమ్మాయికి పెర్ఫార్మన్స్ పరంగా గొప్ప మార్కులు పడేవి కాదు. హృదయం, తాలుమాల నుంచి తనలో నటిని బయటికి తీసుకురావడం మొదలుపెట్టింది. లోకలోనూ కథ డిమాండ్ మేరకు సీరియస్ ఎక్స్ ప్రెషన్లు ఎక్కువ పెట్టింది కానీ యాక్టింగ్ పరంగా మెరుగయ్యిందనేది వాస్తవం. కూతురు సక్సెస్ పట్ల తండ్రి ప్రియదర్శన్ చాలా సంతోషంగా ఉన్నారు. బ్లాక్ బస్టర్ దర్శకుడిగా ఒకప్పుడు ఎన్నో సూపర్ హిట్స్ ఇచ్చిన ఈయన ఇప్పుడు కూడా డైరెక్షన్ చేస్తూనే ఉన్నారు. 90 దశకంలో నాగార్జున నిర్ణయం, బాలకృష్ణ గాండీవం తీశారు కానీ ఆ రెండూ ఆశించిన అంచనాలు అందుకోలేకపోయాయి. తర్వాత మళ్ళీ ఇటువైపు రాలేదు.

# ఒకటి, రెండు కాదు 8 మూవీస్.. వాటిలో పాన్ ఇండియావి



ఇప్పుడంతా పాన్ ఇండియా ట్రెండ్ నడుస్తోంది. హీరోలతో పాటు హీరోయిన్లు కూడా చాలా తక్కువగానే సినిమాలు చేస్తున్నారు. ఉన్నంతలో రష్మిక పలు చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది. అయితే ఈమె కంటే బిజీగా ఉన్న మరో బ్యూటీ ఉంది. ఆమెనే మలయాళ బ్యూటీ సంయుక్త. దాదాపు ఏడాదిన్నరగా ఈమె నుంచి కొత్త మూవీ అప్డేట్ అనేదే లేదు. అలాంటిది ఇప్పుడు ఈమె చేతిలో ఏకంగా 8 మూవీస్ ఉండటం విశేషం. ఇంతకీ అవేంటి? వాటి సంగతేంటి? 2016 నుంచి మలయాళంలో సినిమాలు చేస్తున్న సంయుక్త.. 'భీమ్లా నాయక్'తో టాలీవుడ్‌లోకి వచ్చింది. దీని తర్వాత బింబిసార, సర్, విరూపాక్ష.. ఇలా వరస హిట్స్ అందుకుని గోల్డెన్ లెగ్ అనిపించుకుంది. అయితే 2023లో ఈమె హీరోయిన్‌గా చేసిన 'డెవిల్' ఫ్లాప్ అయింది. గతేడాది ఓ తెలుగు మూవీలో అతిథి పాత్రలో కనిపించింది. అప్పటినుంచి ఈమె నుంచి రిలీజులు ఏం లేవు. తీరా ఇప్పుడు చూస్తే ఎనిమిది చిత్రాలు లైన్‌లో ఉన్నాయి. సంయుక్త చేస్తున్న వాటిలో బాలకృష్ణ 'అఖండ 2', పూరీ–విజయ్ సేతుపతి సినిమా, శర్వానంద్ 'నారీ నారీ నడుమ మురారీ', బెల్లంకొండ శ్రీనివాస్ 'హైందవ', నిఖిల్ 'స్వయంభు', లారెన్స్ 'బెంజ్', మహారాణి అనే హిందీ చిత్రం, తెలుగులో ఓ ఫిమేల్ సెంట్రిక్ చిత్రం ఈమె చేతిలో ప్రస్తుతం ఉన్నాయి. వీటిలో 'అఖండ 2'.. ఈ ఏడాది డిసెంబరులో రిలీజ్ కానుంది. మిగిలినవన్నీ కూడా దాదాపు వచ్చే ఏడాది, ఆపై ఏడాది థియేటర్లలోకి రానున్నాయి. సంయుక్త ప్రస్తుతం చేస్తున్న వాటిలో పూరీ–విజయ్ సేతుపతి, అఖండ 2, స్వయంభు.. పాన్ ఇండియా టార్గెట్‌గా తీస్తున్న మిగిలినవన్నీ కూడా ఆయా భాషల్లో తీస్తున్నారు. మరి వీటి వల్ల సంయుక్త కెరీర్ మళ్లీ గాడిన పడుతుందా? హీరోయిన్?గా నిలదొక్కుకుంటుందా అనేది చూడాలి?



# మాయాజాలాన్ని చూడటానికి సిద్ధంగా ఉండండి..

బాలీవుడ్ స్టార్ హీరో వరుణ్ ధావన్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'సన్నీ సంస్కారీకి తులసి కుమారి'. ఇందులో యంగ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. సన్యా మల్హోత్రా, రోహిత్ సరాఫ్, అక్షయ్ ఒబెరాయ్ కీలక పాత్రలో కనిపించబోతున్నారు. రొమాంటిక్ కామెడీ చిత్రంగా రాబోతుండగా.. శశాంక్ ఖైతాన్ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాను ధర్మ ప్రొడక్షన్, మెంటర్ డిసిపుల్ ఫిల్మ్ బ్యానర్స్‌పై నిర్మిస్తున్నారు. షూటింగ్ శరవేగంగా జరుసుకుంటున్న ఈ మూవీ అక్టోబర్ 2న థియేటర్స్‌లోకి రాబోతుంది. దీంతో ప్రమోషన్స్ స్టార్ట్ చేసిన చిత్రబృందం వరుస అప్డేట్స్ ఇస్తోంది. తాజాగా, ఈ సినిమాకు సంబంధించిన అప్డేట్ రాబోతున్నట్లు సమాచారం. అందరూ ఎంతగానో ఎదురుచూస్తున్న 'సన్నీ సంస్కారీకి తులసి కుమారి' ట్రైలర్ సెప్టెంబర్ 15న రాబోతున్నట్లు టాక్. ఇక ఈ పోస్ట్‌కు "నిరీక్షణ ముగిసింది. ప్రేమ, రంగుల అతిపెద్ద వేడుక సిద్ధంగా ఉంది. మాయాజాలాన్ని చూడటానికి సిద్ధంగా ఉండండి" అని రాసుకొచ్చారు. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీంతో ఈ విషయం తెలుసుకున్న సినీ ప్రియులంతా ఫుల్ ఖుషీ అవుతున్నారు.

# ఆయనతో నా ప్రయాణం అందంగా ఉంటుంది..



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'ది రాజా సాబ్'. ఇందులో మాళవిక మోహనన్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. నిధి అగర్వాల్, రిద్ధి కుమార్, యోగిబాబు, సంజయ్ దత్ కీలక పాత్రలో కనిపించబోతున్నారు. ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తుండగా.. షూటింగ్ కంప్లీట్ కాకపోవడం వల్ల విడుదల వాయిదా పడింది. దీంతో ఈ సినిమా డిసెంబర్ 5న రాబోతున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. భారీ అంచనాల మధ్య రాబోతున్న ఈ మూవీకి సంబంధించిన అప్డేట్స్ కోసం డార్లింగ్ అభిమానులు కళ్లు కాయలు కాసేలా వెయిట్ చేస్తున్నారనడంలో అతిశయోక్తి లేదు. ఈనేపథ్యంలో.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మాళవిక మోహన్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది. "ప్రభాస్ చాలా అద్భుతమైన వ్యక్తి. ఆయన వయసులో నాకంటే పెద్దవాడు. కానీ ప్రభాస్‌ను చూసినప్పుడు అలా అనిపించదు. ఆయనతో కలిసి పనిచేయడం చాలా మధురంగా అనిపించింది. 'ది రాజాసాబ్'లో మా ప్రయాణం చాలా అందంగా ఉంటుంది. నిజానికి మేము సినిమాను పూర్తి చేశాము. ప్రస్తుతం కొన్ని పాటలను చిత్రీకరించాల్సి ఉంది. మీ అందరినీ అలరించేందుకు మా సినిమా సిద్ధంగా ఉంది" అని చెప్పుకొచ్చింది.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.